ప్రజాశక్తి

గురువారం 17 ఏప్రిల్ 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

జెడ్‌పి భేటీపై ప్రతిష్టంభన!

నెల రోజులుగా కొనసాగుతున్న అనిశ్చితి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహణపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. గత నెల 15న జరగాల్సిన జిల్లా పరిషత్ సాధారణ సమావేశం కోరం లేక వాయిదా పడింది. తరువాత గత నెల 29న సమావేశం నిర్వహించాలని జెడ్‌పి సిఈవో జ్యోతిబసు నిర్ణయించారు. అదేరోజు టిడిపి వ్యవస్థాపక దినోత్సవం ఉండటంతో సమావేశాన్ని జిల్లా చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా గ్రూపువారే వాయిదా వేయించారు. సర్వసభ్య సమావేశంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సవరణ బడ్జెట్, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనాల బడ్జెట్‌ను ఆమోదించాల్సి ఉండగా రెండుసార్లు సమావేశం జరగకపోవడంతో జిల్లా కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలను నేరుగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు పంపారు. గత 29వ తేదీ తరువాత ఇంత వరకు మళ్లీ సమావేశం నిర్వహణపై అధికారులు నిర్ణయం తీసుకోలేదు. దీంతో సమావేశం ఎప్పుడు జరుగుతుందనేదీ అంశంపై అనిశ్చితి నెలకొంది.

సమావేశం జరగాలంటే కోరం ఉండాలి. జిల్లా పరిషత్‌లో మొత్తం 54 మంది జెడ్‌పిటిసిలు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, కోఆప్షన్ సభ్యులు కలిపి మొత్తం 83 మంది ఉన్నారు. కోరం ఉండాలంటే మూడో వంతు 28 మంది ఉండాలి. ఈ నేపథ్యంలో టిడిపికి చైర్‌పర్సన్‌తోపాటు 11 మంది జెడ్‌పిటిసిలు ఉన్నారు. మొత్తం 56లో వైసిపికి ప్రస్తుతం 44 మంది ఉన్నారు. గత నెల 15న జరిగిన సమావేశంలో వైసిపి వారంతా మూకుమ్మడిగా గైర్హాజరు కావడంతో కోరం లేక వాయిదా వేశారు. వైసిపి వారు ఇప్పట్లో సమావేశానికి హాజరయ్యే పరిస్థితిలేదు. టిడిపి వారితోనే సమావేశం నిర్వహించాలంటే 12 మంది జెడ్‌పిటిసిలతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిల్లో మరో 16 మంది హాజరు కావాల్సి ఉంది. ఒకేసారి టిడిపి నుంచి ఇంత మంది ప్రజా ప్రతినిధులు హాజరుకావడం సాధ్యం కాకపోవచ్చుననే భావనతో సమావేశం నిర్వహించకుండా నేరుగా బడ్జెట్ ప్రతిపాదనలను ప్రభుత్వ ఆమోదానికి పంపారు. జిల్లా పరిషత్ కార్యవర్గం ఉన్నప్పుడు బడ్జెట్ ప్రతిపాదనలను ఆమోదించకుండా ప్రభుత్వానికి పంపడం ఇదే తొలిసారి అని పలువురు సభ్యులు వ్యాఖ్యానించారు.

సమావేశం నిర్వహణకు కోరం ఉండేలా చూసినా వైసిపి వారు మూకుమ్మడిగా ప్రభుత్వంపై విమర్శలు దాడి చేసే అవకాశం ఉండటంతో జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు ఎవ్వరూ చొరవ తీసుకోవడంలేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో చైర్‌పర్సన్ హెనీ

▶ 2లో

మిర్చియార్డు ఎదుట రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

మిర్చి రైతుల కన్నెర్ర

గుంటూరు యార్డు వద్ద రాస్తారోకో - రోడ్డుపై మిర్చి పోసి నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

మిర్చి ధరలు అంతకంతకూ పడిపోతున్నా పట్టించుకోని ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతులు ఆందోళన చేపట్టారు. బుధవారం గుంటూరు మిర్చియార్డు వద్ద నర్సరావుపేట రోడ్డులో బైటాయించి రాస్తారోకో చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, ఎపి కౌలురైతు సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున రైతులు సుమారు నాలుగు గంటలపాటు నిరసన చేపట్టారు. మద్దతు ధర లేదని, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కూడా అమలు కావట్లేదని, పెట్టుబడులు కూడా రాక అప్పులపాలు అవుతున్నామని వాపోయారు. క్వింటాళ్‌కు రూ.ఐదారు వేలు ఇస్తుంటే వ్యవసాయం ఎలా చేయాలని ప్రశ్నించారు. మిర్చిని రోడ్డుపై పోసి నిరసన తెలిపారు. యార్డు అధికారులు, పోలీసులు అనేక సార్లు ధర్నా విరమింప చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో మధ్యాహ్నానికి జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ వచ్చి రైతులకు హామి ఇచ్చారు. ఈ సందర్భంగా రైతుసంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డి, కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు మాట్లాడుతూ మిర్చి పండించటానికి ఎకరాకు రూ.2.5 లక్షలకుపైగా ఖర్చువుతుంటే ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ పేరుతో క్వింటాళ్‌కు రూ.11,781 ధర ప్రకటించటం సరికాదన్నారు. పైగా అదికూడా అమలు కావట్లేదన్నారు. రూ.8 వేలు, రూ.9 వేలకు ధర తగ్గించేస్తున్నారన్నారు. మరోవైపు ప్రభుత్వం ప్రకటించి ఎంఎస్‌పిపై రెండు నెలలు అవుతున్నా ఇంత వరకూ విధి విధానాలు రూపొందించలేదన్నారు. మేలు రకం మిర్చికి కూడా ఎంఎస్‌పికి కంటే ధర

▶ 2లో

ఇఎస్ఐ ఆస్పత్రికి స్థలం కేటాయింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఇఎస్ఐ ఆస్పత్రికి స్థలాన్ని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. జిల్లాలో ప్రస్తుతం ఐదు ఇఎస్ఐ డిస్పెన్సరీలు ఉన్నాయని, ఇవి కేవలం ప్రాథమిక చికిత్స కేంద్రాలుగా మాత్రమే కొనసాగుతున్నాయని, పూర్తిస్థాయిలో ఇన్‌పేషెంట్ ఆస్పత్రిని నెలకొల్పేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, విశాఖపట్నంలో కలిపి ప్రస్తుతం నాలుగు ఇఎస్ఐ ఆసుపత్రులు పని చేస్తున్నాయని, రాజధాని అమరావతి ప్రాంతంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా రూ.100 కోట్లతో 100 పడకలతో ఇఎస్ఐ ఆసుపత్రిని కేంద్ర ప్రభుత్వం మంజూరు

▶ 2లో

2న ప్రధాని మోడీ రాజధాని పర్యటన

8లో

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్... వెనక ముసుగుల్లో నిందితులు

2లో

హైడ్రో గంజాయి ముఠా అరెస్ట్

ముగ్గురి నుండి రూ.7.5 లక్షల విలువైన 500 గ్రాముల సరుకు స్వాధీనం

4లో

పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలో ర్యాలీ చేస్తున్న ముస్లిములు

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం

మాచర్ల, కారంపూడిలో నిరసన ర్యాలీలు - తహశీల్దార్‌లకు వినతిపత్రాలు

4లో

తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు, వివిధ సంఘాల నాయకులు

సాగు చేయాలన్నవారే మొహం చాటేశారు..

- గతేడాది రూ.15-18 వేలున్న ధర రూ.3 వేలకు పడిపోయింది
- సిఎం హామీనిచ్చినా, జెసి సమక్షంలో కొంటామని చెప్పినా మారని పరిస్థితి
- సమయం మించితే రంగుమారి మరింత నష్టం
- తహశీల్దార్ కార్యాలయం వద్ద బర్లీ పొగాకు రైతుల ఆందోళన

ప్రత్తిపాడు, పిడుగురాళ్ల యార్డులకు చైర్మన్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రత్తిపాడు చైర్మన్ అమరేశ్వరి

వ్యవసాయ మార్కెట్ యార్డులకు పాలక వర్గాల నియామకంలో భాగంగా ప్రత్తిపాడు, పిడుగురాళ్ల యార్డులకు చైర్మన్లను ఎంపిక చేస్తూ టిడిపి బుధవారం అధికారికంగా జాబితా విడుదల చేసింది. పత్తిపాడు యార్డును జనసేనకు కేటాయించారు.జనసేన గుంటూరు రూరల్ మండల జనసేన నాయకురాలు బొందలపాటి అమరేశ్వరిని నియమించారు. అలాగే పిడుగురాళ్ల యార్డు చైర్మన్‌గా టిడిపి నాయకుడు తురకా వీరాస్వామిని నియమించారు. ఈమేరకు టిడిపి జాబితాలను విడుదల చేసింది. త్వరలో అధికారిక ఉత్తర్వులు వస్తాయని అధికార వర్గాలు తెలిపాయి.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల నిర్వహణ, నేర నిరోధం ప్రజలలో భద్రతా భావన కలిగించేందుకు వాహన తనిఖీలు, విజిబుల్ పోలీసింగ్‌ను ముమ్మరంగా అమలు చేయనున్నట్టు డిఎస్‌పి కె.అరవింద్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన పట్టాభిపురం, నగరంపాలెం సిఐలతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. టిజెపిఎస్ కళాశాల వద్ద ప్రత్యేకంగా పోలీసు బందాలు వాహన తనిఖీలు నిర్వహించాయి. వాహన ధ్రువపత్రాల పరిశీలన, నిబంధనలు పాటించడం అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టడం లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహించామని ఆయన తెలిపారు. ప్రజలలో భద్రతా భావన కలిగించేందుకు విజిబుల్ పోలీసింగ్‌ను ప్రాధాన్యతగా తీసుకుంటూ ప్రధాన ప్రాంతాల్లో పెట్రోలింగ్ పికెట్ల ఏర్పాటు చేశామన్నారు.

శంకర్ విలాస్ బ్రిడ్జిపై అపోహలు వద్దు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరగకుండా కొంతమంది ప్రజల్లో అపోహలు సృష్టించి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి మండిపడ్డారు. బుధవారం గుంటూరు నేతాజీ నగర్ లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి, కమిషనర్ పులి శ్రీనివాసులు పర్యటించి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా నేతాజీ నగర్ చెరువును ఎమ్మెల్యే గళ్ళా మాధవి,కమిషనర్ పులి శ్రీనివాసులు పరిశీలించి, దానిని ఎలా అభివధి చేయాలన్న దాని మీద చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ నేతాజీ నగర్ లో ఉన్న చెరువును పరిశీలించారు. గతంలో ఒక ప్రణాళిక లేకుండా ఇష్టానుసారం కాలువలు నిర్మించి, ఆ డ్రైనేజీ నీళ్ళను ఈ చెరువులోకి మళ్ళించడం వలన ఈ ప్రాంతాల్లో నివసించే ప్రజలు అనారోగ్యానికి గురవ్వటమే కాక, విష సర్పాలు ఇక్కడ చేరటం వలన భయభ్రాంతులకి గురవుతున్నామని ప్రజలు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఆమె కమిషనర్‌ను కోరారు. అదే విధంగా అరండల్ పేట బ్రిడ్జి నిర్మాణం జరగకుండా కొంతమంది ప్రయత్నిస్తున్నారని, వారు ప్రజలలో అపోహలు సష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తన కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించి అర్జీలను స్వీకరించారు. ఆమె వెంట కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాం ప్రసాద్, నగరపాలక సంస్థ అధికారులు ఉన్నారు.

మహిళ ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

లైంగిక వేధింపులు తాళలేక ఈనెల 12న మృతి చెందిన నరసరావుపేట మండలం పమిడిమర్రు గ్రామానికి చెందిన మురికిపూడి రాజేష్ భార్య సిపోరా మరణానికి కారకులైన గోరంట్ల శివ నాగరాజు, మొగిలి పార్వతిలను అదుపులోకి తీసుకున్నట్లు డి.ఎస్.పి కె.నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ సందర్భంగా నిందితులను శిక్షించాలని తమ కుటుంబానికి న్యాయం చేయాలని మృతురాలి బంధువులు ఆందోళన చేపట్టిన నేపథ్యంలో నిందితున్ని పట్టుకుని శిక్ష పడేలా చేస్తామని కుటుంబానికి న్యాయం చేస్తామని డి.ఎస్.పి కె.నాగేశ్వరరావు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతురాలు సిపోరా తండ్రి పూనూరి హానోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు లైంగిక వేధింపులకు పాల్పడిన నాగరాజు నాటి నుండి పరారీలో ఉన్నారు. నిందుతుని కోసం గాలిస్తున్న ప్రత్యేక పోలీసు బందం బుధ వారం నరసరావు పేట మండలం యలమంద గ్రామ బైపాస్ రోడ్డు మార్గంలో ఉన్న నాగరాజును అదుపులోకి తీసుకుని స్టేషన్ కు తరలించారు. నాగరాజుపై, అతనికి సహకరించిన పార్వతి లపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ప్రాథమిక విచారణ అనంతరం కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు తెలిపారు.

'ఉల్లాస్' ద్వారా 10,164 మందికి అక్షరాస్యత

రెండో దశలో పట్టణ ప్రాంతాల్లోనూ 30 వేల మంది లక్ష్యం

సమీక్షలో పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సమీక్షలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఉల్లాస్ (అందరికీ అక్షరాస్యత) కార్యక్రమం ద్వారా 2024-25లో మొదటి విడతగా జిల్లాలో 15 ఏళ్ల పైబడిన 10,707 మంది నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దామని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు వెల్లడించారు. 2025-26 విద్యా సంవత్సరంలో 30 వేల మందిని ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యులుగా చేయాలని అధికారులకు లక్ష్యంగా నిర్దేశించారు. నరసరావుపేట కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మొదటి దశలో కేవలం గ్రామీణ ప్రాంతాల్లో వయోజన విద్య కార్యక్రమాలు నిర్వహించామని, రెండో దశలో పట్టణ ప్రాంతాల్లోనూ నిరక్షరాస్యులను గుర్తించి తరగతులు నిర్వహించాలని చెప్పారు. ఈ మేరకు మున్సిపాలిటీల్లో ఉల్లాస్ సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. సెర్ప్, మెప్మా లబ్ధిదారులు, జెడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో బోధనేతర సిబ్బంది, అంగన్‌వాడీ సహాయకులు, ఉపాధి హామీ కూలీల్లో నిరక్షరాస్యులను గుర్తించి నమోదు చేయాలన్నారు. సెర్ప్, మెప్మా అధికారులు ప్రతి 10మంది అభ్యాసకులకు ఒక విద్యా వాలంటీర్ చొప్పున నియామకాలు చేపట్టాలన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో తరగతులు నిర్వహించి జిల్లాలోని ప్రతి ఒక్కరూ రాయడం, చదవడం, ఆర్థిక లావాదేవీలు చేయగలిగేలా శిక్షణివ్వాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వయోజన విద్య అధికారి జగన్ మోహన్‌రావు, డీఈవో చంద్రకళ, డిఆర్‌డిఎ పీడీ ఝాన్సీరాణి, గ్రామ-వార్డు సచివాలయాల నోడల్ అధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మిర్చి రైతుల కన్నెర్ర

(మొదటి పేజీ తరువాయి)

రావట్లేదన్నారు. కావున మిర్చి రైతులు అందరికి రూ.5వేలు చొప్పున ప్రభుత్వం బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. బోనస్ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని జేసీ హామీ ఇచ్చారు. యార్డులో మిర్చి విక్రయించిన రైతులందరికీ స్కీమ్ వర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం స్పందించిన పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో రైతుసంఘం గుంటూరు, పల్నాడు జిల్లాల కార్యదర్శులు కె.అజయ్‌కుమార్, ఏపూరి గోపాలరావు, నాయకులు జి.బాలకృష్ణ, ఎన్.రామచంద్రయ్య, బి.శ్రీనివాసరావు, ఐ.రామారావు, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

ఇఎస్ఐ ఆస్పత్రికి స్థలం కేటాయింపు

(మొదటి పేజీ తరువాయి)

చేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయిస్తే వెంటనే నిర్మాణానికి కేంద్రం సిద్ధంగా ఉందని సిఎం చంద్రబాబు దృష్టికి తాను తీసుకెళ్లగా భూమిని కేటాయింపునకు మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలిపారని వెల్లడించారు. 6.35 ఎకరాలను ఉచిత ప్రాతిపదికన కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం సూచించిందని, అయితే అందుకు భిన్నంగా అవసరమైన భూమి నిమిత్తం ఎకరాకు రూ.1.69 కోట్ల చొప్పున 6.35 ఎకరాలకు రూ.10.77 కోట్ల మొత్తాన్ని చెల్లించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదించిందని మంత్రి పేర్కొన్నారు. ప్రత్తిపాడు మండలంలో ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం త్వరలో ప్రారంభం అవుతుందని తెలిపారు.

జెడ్‌పి భేటిపై ప్రతిష్టంభన!

(మొదటి పేజీ తరువాయి)

క్రిస్టినా గ్రూపు కొంత మంది సీనియర్ టిడిపి నాయకులు ఈ సమస్య విన్నవించగా వైసిపి వారిలో కొంత మంది అయినా తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తే బలం పెరుగుతుందని అప్పుడు సమావేశం నిర్వహణ సునాయసనం అవుతుందని అన్నట్లు తెలిసింది. చైర్‌పర్సన్ తీరును మెజార్టీ జెడ్‌పిటిసిలు వ్యతిరేకిస్తున్నారు. తమను సంప్రదించకుండా అభివృద్ధి పనులు, విధానపరమైన నిర్ణయాలు తీసుకుని నేరుగా సమావేశంలో ర్యాటిఫికేషన్ కోసం పెడుతున్నారని వైసిపి సభ్యులు మండిపడుతున్నారు. వైసిపి నుంచి టిడిపిలో చేరిన 11 మందిలో కూడా కొంతమంది అసంతృప్తిగా ఉన్నారనే ప్రచారమవుతోంది.

హైడ్రో గంజాయి ముఠా అరెస్ట్

ముగ్గురి నుండి రూ.7.5 లక్షల విలువైన 500 గ్రాముల సరుకు స్వాధీనం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

హైడ్రో గంజాయిని సేవించడంతోపాటు విక్రయాలకు పాల్పడే ముగ్గుర్ని అరెస్టు చేసినట్లు గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన బుధవారం వివరాలు వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఒకరు, విశాఖపట్నానికి చెందిన ఇద్దరు అరెస్టయిన వారిలో ఉన్నారు. వీరికి బెంగుళూరులో ఉండే వ్యక్తితో సంక్రాంతి సందర్భంగా పరిచయం ఏర్పడగా ఆ తర్వాత అతని వద్ద నుండి హైడ్రో గంజాయిని తెచ్చి ఏలూరులో విక్రయించేందుకు పూనుకున్నారు. గ్రాము గంజాయిని రూ.700కు కొని రూ.1500కు విక్రయిస్తున్నారు. ఇందులో భాగంగా బెంగుళ్లూరు వెళ్లి హైడ్రో గంజాయి తెస్తూ కాజా టోల్‌ప్లాజా వద్ద విక్రయిస్తుండగా అప్పటికే అక్కడ నిఘా వేసిన మంగళగిరి రూరల్ సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ అదుపులోకి తీసుకున్నారు. సరుకుతోపాటు మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరొకర్ని పట్టుకోవాల్సి ఉందని ఎస్పీ తెలిపారు. ముఠాను పట్టుకున్న సిఐ, ఎస్ఐ, సిబ్బందిని అభినందించారు.

ఔషధ అభివృద్ధి, చికిత్సా ఫలితాలపై

చలపతిలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న మేహేష్

లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో బుధవారం ఔషధ అభివృద్ధి, చికిత్స ఫలితాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో క్లింఫార్మేడ్ మేనేజింగ్ డైరెక్టర్ వి.మహేష్ మాట్లాడుతూ ఒక ఔషధాన్ని తీసుకున్న తర్వాత అది శరీరంలో ఎలా అరిగిపోతుంది, శరీరంలో ఏఏ రకాల మార్పులకు లోనవుతుంది, ఎంతసేపు ప్రవర్తిస్తుంది, చివరికి ఎలా బటయటకు పంపబడుతుంది అన్న విషయాలను కలిపి ఫార్మాకోకినెటిక్స్ అని పిలుస్తామన్నారు. అలాగే బయోఫార్మాస్యూటిక్స్ అనేది ఔషధ రూపకల్పన, దాని బయోలాజికల్ ప్రభావం మధ్య సంబంధాన్ని అధ్యయనం చేసే విభాగం అన్నారు. ఈ రెండూ ఔషధ ప్రభావాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామారావు, బి.ఫార్మసీ, ఫార్మా డి విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్రవ్యాప్త అగ్ని ప్రమాద వారోత్సవాల్లో భాగంగా మంగ ళవారం మంగళగిరి పట్టణంలో బుధవారం రాత్రి టిట్కో గృహాల సముదాయంలో ఉన్న ప్రజలకు మంగళగిరి ఫైర్ స్టేషన్ అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంగళగిరి ఫైర్ స్టేషన్ సిఐ వై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వేసవి కాలంలో వంట గ్యాస్ లీకేజ్ వలన, ఎలక్ట్రికల్ షాట్ సెక్యూరిటీ వల్ల జరిగే ప్రమాదాలను నివారించే చర్యలను వివరించారు. ప్ర వ మా దా లు ఎక్కువగా జరుగుతాయని వాటిని నివారించేందుకు పలు సూచనలను తెలియజేశారు.

అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

ప్రభుత్వ సర్వేలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న కమిషనర్

ప్రభుత్వ ప్రాధాన్యత సర్వేలన్నీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నగరపాలక సంస్థ విభాగాధిపతులు, అధికారులు, సచివాలయ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డు సచివాలయాల వారీగా ప్రభుత్వ ప్రాధాన్యత సర్వేలన్నీ నిర్దేశిత గడువులోగా పూర్తీ చేయడానికి కార్యదర్శులు, నోడల్ అధికారులు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. మే2న ప్రధాని పర్యటనలో జిఎంసి అధికారులకు కేటాయించిన విధులు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రతినెల 3వ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ఈనెల 19న ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ అంశం ఉంటుందని, ప్రతి డివిజన్‌లో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. నెలాఖరులోగా ఆస్థి పన్ను ఏకమొత్తంగా చెల్లిస్తే 5శాతం, బకాయిలు ఏకమొత్తంగా చెల్లిస్తే వడ్డీపై 50శాతం రాయితీ ఉన్నందున పన్ను చెల్లింపుదారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ అమతం, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, పి.శ్రీనివాసరావు, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుంటూరులో కాంగ్రెస్ ధర్నా

సోనియా, రాహుల్‌పై ఈడి కేసులకు నిరసన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎన్‌ఫోర్సుమెంట్ డైరక్టరేట్ కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై కేసులు నమోదు చేయడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నాయకులు బుధవారం స్థానిక నగరంపాలెం సెంట్రల్ జిఎస్‌టి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈడీ కేసులతో నెహ్రూ, గాంధీ కుటుంబాలను భయపెట్టలేరన్నారు. దేశంలో ప్రజాదరణ కోల్పోతున్న బిజెపి కాంగ్రెస్ నాయకులను మానసికంగా దెబ్బతీసి రాజకీయంగా లబ్ధిపొందాలన్న దూరాలోచనతో తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చిలకా విజయ్ అన్నారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తప్పుపడుతున్నందునే రాహుల్ గాంధీ, సోనియాలపై కేసులు నమోదు చేశారన్నారు. గాంధీ కుటుంబాన్ని రాజకీయాల్లో లేకుండా చేయాలన్న లక్ష్యంతో ఈ తరహాలో కేసులు పెడుతున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీ పై పెట్టిన కేసులను వెంటనే వెనక్కు తీసుకోవాలని లేని పక్షాన ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్ వలి, కాంగ్రెస్ నాయకులు బిళ్ళా సునీల్ , గడ్డం పాల్ విజయకుమార్, మధున్ మోహన్ రెడ్డి, రాచకొండ జాన్ బాబు షేక్ సలీం , తోడేటి సందీప్, కట్టా జోహార్ బాబు, బట్ల బ్రహ్మయ్య,. ప్రసాదు, షేక్ జబీబుల్లా, యున్నం సుధీర్ బాబు , షేక్ నాగుర్ బాబు, కరీం, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

NOTICE
IN THE COURT OF THE III
ADDL.DIST.JUDGE:: GUNTUR
E.P.NO.350/2019 IN O.S.NO.79/2014

Between:
Doddi Seetharamaiah& Another. ...D.Hr's
And
Nandyala Dhanalakshmi .....J.Dr
To,
Nandyala Dhanalakshmi,W/o .Sadananda Reddy,R/o. Kantheru Village, Tadikonda (Md), Guntur Dist.

పై నెంబరు ఇ.పి.ని డి.హెచ్.ఆర్స్ షెడ్యూలు ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయమని కొరుచూ దాఖలు చేయగా సదరు ఇ.పి.లో జె.డి.ఆర్.అయిన మీకు నోటీసులు పంపించినను మీకు ముట్టనందున మీకు నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది.28-04-2025కి వాయిదా వేసినారు.కావున వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడును.

వాయిదా తేది:28-04-2025

గేరా వెంకట సుబ్బారావు,
డి.హెచ్.ఆర్స్.తరపు అడ్వకేట్, గుంటూరు.

బెస్ట్ క్రైమ్ డిటెక్షన్ అవార్డు అందుకున్న తెనాలి డిఎస్పి

ప్రజాశక్తి - తెనాలి

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన దళిత మైనర్ బాలిక హత్య కేసును చాకచక్యంగా చేదించిన డిఎస్పి బి జనార్ధన రావును డిజిపి హరీష్ కుమార్ గుప్తా అభినందించారు. డిజిపి కార్యాలయంలో బుధవారం అత్యంత ప్రతిష్టాత్మకమైన అవార్డు ఫర్ బెస్ట్ క్రైమ్ డిటెక్షన్ (ఎబిసిడి) పురస్కారంతో సత్కరించారు. వివరాలను పరిశీలిస్తే గత ఏడాది చేబ్రోలు పోలీసులు మైనర్ బాలిక హత్య కేసు నమోదు చేయగా, డి.ఎస్.పి జనార్ధన్ రావు నేతత్వంలో దర్యాప్తు కొనసాగింది. ఈ కేసులో నిందితుడు ఇబ్రహీంపట్నం ప్రాంతానికి చెందిన నరమామిడి నాగరాజు పాత నేరస్థుడు. అతనిపై గతంలో ఓ హత్య కేసు, మరికొన్ని ఇతర కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో నాగరాజు కొంతకాలం కిందట చేబ్రోలు వచ్చి, పరిసర ప్రాంతాలలోని స్పిన్నింగ్ మిల్స్ లో, హెూటల్స్‌లో పనిచేసేవాడు. స్థానికంగా ఓగ్యాస్ ఏజెన్సీ డెలివరీ బాయ్‌తో పరిచయం పెంచుకొని, అతనికి గ్యాస్ డెలివరీలో సహాయకారిగా ఉండేవాడు. ఈ నేపథ్యంలో స్థానికం గానే ఓ ఇంట్లో ఒంటరిగా ఉంటూ, కొత్తరెడ్డిపాలెంకి చెందిన వివాహిత చిన్న మ్మాయితో పరిచయం పెంచుకున్నాడు. ఆమెతో వివాహేతర సంబంధాన్ని కొన సాగించాడు. అతనితో ఉన్న సన్నిహిత్యంతో ఆమె తన కుమార్తె, కుమారుడికి నాగరాజును బాబాయిగా పరిచయం చేసింది. కొంతకాలం తర్వాత చిన్న మ్మాయితో నాగరాజుకు విభేదాలు ఏర్పడ్డాయి. దీంతో నాగరాజు పలుమార్లు ఫోన్ చేసినా ఆమె స్పందించలేదు. ఆమె పై ద్వేషం పెంచుకున్న నాగరాజు ఏడో తరగతి చదువుతున్న ఆమె కుమార్తె పేరిపోగు శైలజను పాఠశాలకు వెళుతుండగా అటకాయించి, తాను ఉండే ఇంటిలో హతమార్చి అదృశ్యమయ్యాడు. సెల్ఫోన్ నంబర్లు కూడా మార్చి పోలీసులకు కూడా సవాలుగా మారాడు. అయితే ఈ కేసును చేదించడంలో పోలీసులు పలు కోణాలలో కుపీలాగారు. నిందితుడి కాల్ డేటా, మరికొన్ని సాంకేతిక ఆధా రాలతో నాగరాజును నిందితుడిగా తేల్చి, పరారీలో ఉన్న అతనిని అత్యంత చాకచక్యంగా అరెస్టు చేశారు. కేసును సమర్ధ వంతంగా చేదించిన నేపథ్యంలో డిఎస్పి జనార్ధనరావును డిజిపి అభినందించారు. డిజిపి నుంచి ఎబిసిడి కన్సోలేషన్ మెడల్ అందుకున్న డిఎస్పీని సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది అభినందించారు.

అవార్డు అందుకుంటున్న డిఎస్‌పి

హోటళ్లలో తనిఖీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ లక్ష్మీనారాయణ, పల్నాడు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పిల్లి యజ్ఞనారాయణ ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణ పల్నాడు రోడ్డులోని హెూటళ్ళలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. టి స్టాల్ లో వినియోగిస్తున్న లూజ్ పాలు మరియు టి పొడి సాంపిల్స్ సేకరించి ల్యాబ్ కు పంపారు. టీతయారు చేసే పాత్ర లు శుభ్రంగా ఉండాలన్నారు. సందర్బంగా పల్నాడు జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ లక్ష్మీనారాయణ మీడియతో మాట్లాడుతూ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలలో ఏపి వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర క్రియాశీల కార్యదర్శి కె.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

తొలి ఏకాదశికి ఘాట్ రోడ్డును పూర్తి చేయాలి

అధికారులతో సమీక్షించిన ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ కొండపై వేంచేసి ఉన్న శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయ ఘాట్ రోడ్డు నిర్మాణాన్ని తొలి ఏకాదశి పండుగ లోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు అధికారులను ఆదేశించారు. దేవాలయం,ఘాట్ రోడ్డు, గిరిప్రదర్శన రోడ్డు నిర్మాణంపై బుధవారం చీఫ్ విప్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జూలై 7వ తేదీ జరగబోవు తొలి ఏకాదశి పండుగ భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఘాట్ రోడ్డు నిర్మాణానికి 5.90 కోట్లు, గిరి ప్రదర్శన రోడ్డు నిర్మాణానికి 1.20 కోట్లు, రామలింగేశ్వర స్వామి దేవాలయం నిర్మాణానికి రూ.2 కోట్లు నిధులు మంజూరు చేయించానని, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను చీఫ్ విప్ జీవి ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలతో దేవాల యం, గిరి ప్రదర్శన రోడ్డు, ఘాట్ రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు. సమీక్ష సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, జనసేన, బిజెపి నాయకులు, పంచాయతీరాజ్ ఎస్.ఈబ్రహ్మయ్య, డ్వామా పిడి సిద్ధ లింగమూర్తి, ఆర్అండ్‌బి, పిఆర్, పిఐయు, ఆర్డబ్ల్యూఎస్, ఎలక్ట్రిసిటీ డిఈలు, ఏఈలు, దేవాదాయ శాఖ డీఈ, ఏఈ లు, ఈవోలు, ఫారెస్ట్, రెవిన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు, వార్డు కౌనిసిలర్లు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం కేసులో ఆరుగురి బైండోవర్

ప్రజాశక్తి-ఈపూరు

ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బొల్లాపల్లి మండలంలోని వెల్లటూరు, రేమిడిచర్ల గరికపాడు గ్రామాలలో మద్యం కేసులకు సంబంధించి ఆరుగురు వ్యక్తులను బొల్లాపల్లి తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బైండోవర్ చేయడం జరిగిందని ఎక్సైజ్ సిఐ డి వెంకటేశ్వర్లు తెలిపారు. అక్రమ మద్యం కలిగి ఉండటం, విక్రయించడం, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం చట్టత్యా నేరమని ఆయన అన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - తెనాలి : వ్యక్తి అదృశ్యంపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రూరల్ గ్రామం నందివెలుగు జాషువా నగర్‌కు చెందిన కొత్తపల్లి రమేష్ తన అన్న దీన దయాళ్ వద్ద నందివెలుగులో ఉంటున్నాడు. ఈనెల 9న దీన దయాళ్ నిద్రిస్తున్న సమయంలో, రమేష్ ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు.రమేష్ ఇంటి నుంచి బయటకు వెళుతున్న సమయంలో తెలుపు చొక్కా, నలుపుప్యాంటు ధరించి ఉన్నాడని, గుర్తించినవారు రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

గ్యాస్ లీక్ అయితే ఇలా చేయండి..

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వంటింట్లో గ్యాస్ సిలిండర్ లీక్ అయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అపార్ట్మెంట్ వాసులకు అగ్నిమాపక సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సీనియర్ లీడింగ్ ఫైర్ మాన్ ఎస్కే గౌస్ డ్రైవర్ ఆపరేటర్ డి విజయభాస్కర్ రెడ్డి ఫైర్ మాన్లు వై.మహేంద్ర రెడ్డి ఎం రమణ నాయక్ పి గోవిందు బి నాగేశ్వరావు ఎస్ కే సుభాని పాల్గొన్నారు.

పరస్పరం దాడులు.. నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-ఈపూరు : వైసిపి, జనసేన పార్టీలకు చెందిన వారు చేసుకున్న దాడిలో నలుగురికి గాయాలైన సంఘటన మండలంలోని కొచ్చర్ల గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన తన్నీరు కోటేశ్వరరావు ద్విచక్ర వాహనంపై దిగుతుండగా పక్కనే ద్విచక్ర వాహనంపై ఉన్న గోలి గణేష్‌కు కాలు తగలడంతో గొడవ ప్రారం భమై కర్రలు, రాళ్లతో దాడులు చేసుకున్నారు. ఈ దాడులలో లక్కిశెట్టి బుచ్చమ్మ, రాగాల భువనేశ్వరి, తన్నీరు కోటేశ్వరరావు, తన్నీరు గోపికు గాయాలయ్యాయి. క్షతగాత్రులు చికిత్స నిమిత్తం ఈపూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు.బాధితుల నుండి వివరాలు నమోదు చేసుకున్నారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL
JUDGE (JUNIOR DIVISION), TENALI
O.S. 108/2024

Between :
Polisetti Venkatappaiah .... Plaintiff
Vs
Tullimilli Gopi .... Defendant
To,
Tullimilli Gopi, S/o late Chintaiah, Telaprolu Road, Athota (V), Kollipara (M), Guntur (Dist.)

పై కోర్టులో ప్లెయింటిఫ్ మీపై బాకీ వసూలు నిమిత్తం దావా దాఖలు చేసియున్నారు. ఈ దావాలో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకోకుండా కాలయాపన చేస్తున్నందున ఈ పబ్లికేషన్ ద్వారా తెలియపరచటమైనది. మీ హాజరు నిమిత్తం ది. 8-5-2025వ తేదీన శ్రీ కోర్టువారు వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరపు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపనలు తెలుపుకొన గలరు. లేనియెడల సదరు దావాలో మీ పరోక్షమునవ ఇచారించి తీర్మానించ బడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

వాయిదా : 8-5-2025

ఇట్లు
చందు వెంకటేశ్వరరావు,
వాది తరఫు న్యాయవాది, తెనాలి.
సెల్ : 94408 52446

IN THE COURT OF THE 9TH ADDL.
DISTRICT JUDGE, KRISHNA,
MACHILIPATNAM
M.V.O.P No. 48/2024

Between :
అబ్బూరి రత్నకుమారి .... పిటీషనర్
అండ్
రావినూతల గాబ్రియేల్ మరియు ఇతరులు
... రెస్పాండెంట్స్
టు,
నల్లపాటి అంకమ్మ, తండ్రి : వెంకట రాయుడు, వయస్సు 40 సం॥లు, మెయిన్‌రోడ్డు, నరసరావుపేట, గుంటూరుజిల్లా.

పై నెంబరు పిటీషన్‌ను రత్నకుమారి గారు కోర్టులో దాఖలు చేసి మీకు నోటీసు పంపినా తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. అందువల్ల కోర్టువారి అనుమతితో ఈ నోటీసు ద్వారా మీకు ది. 8-5-2025నాడు వాయిదా వున్నది. కావున మీరుగానీ, మీ యొక్క లాయరుగారి ద్వారా గానీ కోర్టువారి యెదుట ఉదయం 10-30 గం.లకు హాజరయి మీ యొక్క అభ్యంతరాలు తెలుపగలరు. లేనియెడల కోర్టువారు మీకు పరోక్షంగా పిటీషన్ తీర్మానం చేయగలరు.

మచిలీపట్నం.
ది. 18-4-2025

ఇట్లు
శ్రీపతి బాలసుబ్రహ్మణ్యం,
న్యాయవాది,
సెల్ : 9505027579.

GENERAL NOTICE
IN THE COURT OF THE PRL.CIVIL
JUDGE(SENIOR DIVISION):: GUNTUR
S.O.P.NO.16/2025

Between:
1)Chukka Ravi Teja,S/o.Late Chukka Philip,2) Chukka Kranthi Kumar,S/o.Late Chukka Philip, both are R/o.Door No.5-163,Opp.R.C.M.Church,VTC, Gorantla, P.O. Gorantla Guntur, Guntur Dt
..... Petitioners
And
The Branch Manager,Union Bank of India,Opp.Venkateswara Swamy temple, Amaravathi, Industrial Estate, Gorantla, Guntur Dist,A.P.-522034 .... Respondent

పై నెంబరు యస్.ఓ.పి.లోని పిటీషనర్లు, లేటు చుక్కా ఫిలిప్స్ యొక్క భార్య లూర్దమ్మకు వచ్చిన పెన్షన్ బెనిఫిట్స్ మొత్తం రెస్పాండెంటు యొక్క బ్యాంక్ వారి నుండి పొందుటకు Succession Certificate కొరకు దాఖలు చేయగా సదరు పిటీషనులో ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు వగైరాలు ఉన్నచో తెలుపుకొనవలసినదిగా కొరుచూ శ్రీ కోర్టు వారు జనరల్ నోటీసు నిమిత్తం ది.21-04-2025కి వాయిదా వేసినారు.కావున ఆక్షేపణలు ఉన్న వారు వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట వారికి గల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనిచో శ్రీకోర్టు వారిచే చట్టప్రకారం విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది:21-04-2025

గేరా వెంకట సుబ్బారావు,
ఎ.త్రినాథ్,
పిటీషనర్లు తరపు అడ్వకేట్స్, గుంటూరు.

Ph: 08592-233005

ది గుంటూరు జిల్లా పొగాకు ఉత్పత్తిదారుల మరియు క్యూరర్ల సహకార మార్కెటింగ్ సంఘము లిమిటెడ్, భాగ్యనగర్ 1వ లైను- ఒంగోలు.

మహాజన సభ సమావేశము

ది గుంటూరు జిల్లా పొగాకు ఉత్పత్తిదారుల మరియు క్యూరర్ల సహకార మార్కెటింగ్ సంఘము లిమిటెడ్, ఒంగోలు యొక్క మహాజన సభ తేది : 06-05-2025 మంగళవారం ఉదయం 11-00 గం.లకు సంఘ ప్రధాన కార్యాలయము, ఒంగోలు నందు సంఘ అధ్యక్షురాలు శ్రీమతి తాటిపర్తి ఉదయలక్ష్మీ గారి అధ్యక్షతన జరుగును. కావున మహాజన సభ సభ్యులు అందరూ హాజరు కావలసినదిగా కోరడమైనది

మద్యం తాగిన వలస కార్మికుడు మృతి

ప్రజాశక్తి - యడ్లపాడు

మృతి చెందిన బీమ్‌సేన్ మాలిక్

యడ్లపాడు మండలం తిమ్మాపురం జాతీయ రహదారి పక్కనే ఉన్న భవనం నూలు మిల్లులో కార్మికుడు బీమ్‌సేన్ మాలిక్ బుధవారం మృతి చెందాడు. బీమ్‌సేన్ మాలిక్ మద్యానికి బానసయ్యాడు. మిల్లులోని క్వార్టర్స్‌లో ఒంటరిగా ఉంటున్నాడని, మద్యం సేవించిన సమయంలో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు ప్రాథమిక విచారణ లో భావించారు. కార్మికుడు ఒరిస్సా ప్రాంత వాసి కావడంతో అక్కడి వారికి సమాచారం ఇచ్చాడు. నాలుగేళ్ల కిందట ఒరిస్సాను విడిచి ఉపాధి నిమిత్తం ఏపీకు వచ్చిన బీమ్‌సేన్‌మాలిక్ కుటుంబ సభ్యులను ఒకసారి కూడా కలుసుకోలేదనీ, రూపాయి కూడా తమకు పంపించలేదనీ, తాము అంత్యక్రియల ప్రక్రియకు రాలేమని పోలీసులకు సమాచారం అందించినట్లు ఎస్ఐ టి.శివ రామకృష్ణ తెలిపారు. ఈ నేపథ్యంలో మిల్లులో పనిచేస్తున్న ముఠా మేస్త్రీ ఫిర్యాదు మేరకు బుధవారం మృతదేహానికి శవ పంచనామ నిర్వహిస్తున్నట్లు తెలిసింది.

700 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - మాచర్ల

ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు బుధవారం వెల్దుర్తి మండలం కొత్తపుల్లారెడ్డి గూడెం అటవీ ప్రాంతంలో నాటు సారాయి స్థావరాలుపై దాడులు నిర్వహించారు. నాటుసార తయారీకి సిద్ధం చేసిన 700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 15 లీటర్ల నాటు సారాయిని సీజు చేశారు. ఈ కేసులలోని ముద్దాయిలను త్వరలో అరెస్ట్ చేస్తామని ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎం రవికుమార్ రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో ఏఈ ఎస్.జి. సూర్యనారాయణ, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.రవీంద్ర, మాచర్ల సిఐ వెంకట రమణ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో డిపిఒ పర్యటన

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని తుర్లపాడు, ఉన్నవ గ్రామాలలో జిల్లా పంచాయతీ అధికారి విజయ్ భాస్కర్ రెడ్డి పర్యటించారు. ఎస్సీ కాలనీలో పర్యటించి గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగ్గాపురం గ్రామంలో పర్యటించి పిడబ్ల్యూఎస్ స్కీము నిర్వహణ గురించి పరిశీలించారు. అనంతరం ఎడ్లపాడు గ్రామ పంచాయతీలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రంను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కోళ్ల చోరీ కేసులో ఐదుగురికి రిమాండ్

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని మోరంపూడి గ్రామంలో మూడు రోజుల కిందట కోళ్ల దొంగతనానికి పాల్పడిన ఐదుగురు యువకులను గురువారం స్థానిక ఎస్సై ఎస్ వెంకట రవి అరెస్టు చేసి తెనాలి కోర్టుకు హాజరు పరచారు. జడ్జి నిందితులను రిమాండ్‌కు పంపించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్ద కొండూరు గ్రామానికి చెందిన కుంపటి నితిన్ కుంపటి రాకేష్ కుంపటి ఏసోబు కుంపటి కళ్యాణ్ రావు శుద్ధపల్లి కళ్యాణ్ మోరంపూడి గ్రామంలో రెండు పుంజులు మూడు కోళ్లను దొంగలించారు. వీటి విలువ దాదాపు రూ.30వేలు ఉంటుందని తెలిపారు. దొంగతనానికి పాల్పడిన వారి వద్ద నుండి కోళ్లను స్వాధీనం చేసుకొని వారి యజమానులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - మాచర్ల



గాయపడిన వ్యక్తి

పట్టణ సమీపంలోని రాయవరం జంక్షన్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులు తీవ్ర గాయాలు పాలయ్యారు. దుర్గి మండలం అడిగోప్పల గ్రామానికి చెందిన చల్లా అశోక్, గోగులవాసులు ద్విచక్ర వాహనంపై మాచర్ల వచ్చి తిరిగి వెళుతుండగా రాయవరం జంక్షన్ వద్ద టిప్పర్ ఢీకొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి క్షతగాత్రులను మాచర్ల ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట తరలించారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సివిల్స్ అభ్యర్థులకు 30 నెలల పాటు ఉచిత వసతితో కూడిన శిక్షణ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వినుకొండ

సివిల్స్‌కు సిద్ధమయ్యే అభ్యర్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా 30 నెలలపాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ లక్ష్మయ్య ఐఎస్ అకాడమీ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వినుకొండలో ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీ, బీసీ మహిళా అభ్యర్థుల్లో ప్రతిభ ఉన్న 10 మందిని ఎంపిక చేసి శివశక్తి ఫౌండేషన తరపున ఉచితంగా శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఎంపికైన వారికి వసతి, భోజనం సహా అన్ని ఏర్పాట్లూ చేస్తామన్నారు. అందుకు సంబంధించిన పరీక్షను ఆదివారం నిర్వహిస్తామని, వినుకొండ పట్టణం కరిచేడు రోడ్డులోని సీతారామపురం ఐనవోలు దగ్గర ఉన్న డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ స్టడీ సర్కిల్ భవనంలో పరీక్ష ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 8639379369 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

నేడు షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

షూటింగ్ బాల్ సబ్ జూనియర్ విభాగంలో బాలబాలికల జిల్లా జట్ల ఎంపికలు మండలంలోని గుడిపూడి జెడ్‌పి పాఠశాలలో గురువారం నిర్వహిస్తామని షూటింగ్ బాల్ అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు ముప్పా నరసింహారావు బుధవారం తెలిపారు. 01-04-2008 తర్వాత జన్మించిన క్రీడాకారులు అర్హులని, హాజరయ్యేవారు ఆధార్ కార్డుతో పాటు స్టడీ సర్టిఫికెట్, తల్లిదండ్రుల అంగీకార పత్రంతో తెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైనవారు ఈనెల 26, 27 తేదీల్లో చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు 9494675082, 9848655755 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గొప్ప సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం

ఐద్వా ఆధ్వర్యంలో జయంతి సభ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

బాల్యవివాహాలను వ్యతిరేకించి పునర్వివాహాలను ప్రోత్సహించిన గొప్ప సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి జి.రజిని, పట్టణ కార్యదర్శి జి.ఉమశ్రీ అన్నారు. వీరేశలింగం జయంతిని స్థానిక 17వ వార్డు శాలివాహన నగర్‌లో బుధవారం నిర్వహించారు. సభకు సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.హరిపోతురాజు అధ్యక్షత వహించగా రజిని, ఉమశ్రీ మాట్లాడుతూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా వీరేశలింగం పెద్ద ఎత్తున ప్రజానీకాన్ని ఐక్యం చేశారని, ఎన్నో అవమానాలు ఎదురైనా అన్నిటినీ భరించి సంస్కరణలు తెచ్చారని అన్నారు. నేటికీ మనువాద సిద్ధాంతాలు ఆచరణలో ఉండడం వల్ల మహిళలు, చిన్నపిల్లలపై దాడులు కొనసాగుతునే ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చారు. వీటిని తిప్పికొట్టడానికి మహిళలే ధైర్యంగా ముందుకు సాగాలన్నారు.

పంటలను కూల్చేసిన గాలి, వాన

గాలి, వాన ధాటికి దెబ్బతిన్న పొగాకు.. కూలిన మామిడి చెట్లు

ప్రజాశక్తి - రెంటచింతల

అకాల వర్షం, ఈదురు గాలులు రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. రూ.లక్షలాది పంట నీటిపాలై రైతులు గుండెలు బాదుకుంటున్నారు. మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలులు, వర్ష బీభత్సానికి పలు పండ్ల తోటలు, పొగాకుకు నష్టం వాటిల్లింది. మండలంలోని పసర్లపాడు, తుమ్మకోట గ్రామాల్లో 40 ఏళ్ల తరువాత పొగాకు సాగును 150 ఎకరాల్లో చేపట్టగా ఆరబెట్టడానికి వేసిన పందిళ్లు గాలి, వానకు నేల కూలి పొగాకంతా నీటిపాలైందని 11 ఎకరాల్లో సాగుచేసిన వీరేపల్లి లక్ష్మీనారాయణ చౌదరి వాపోయారు. మామిడి తోటలో కొమ్మలు ఇరగటంతో పాటు మామిడికాయలు రాలిపోయాయని, అరటి తోటల పరిస్థితి అంతంత మాత్రమే ఉందని రైతులు చెబుతున్నారు. పంట నష్టం అంచనా వేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా మండలంలో 12.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

సాగు చేయాలన్నవారే మొహం చాటేశారు..

- గతేడాది రూ.15-18 వేలున్న ధర రూ.3 వేలకు పడిపోయింది
- సిఎం హామీనిచ్చినా, జెసి సమక్షంలో కొంటామని చెప్పినా మారని పరిస్థితి
- సమయం మించితే రంగుమారి మరింత నష్టం
- తహశీల్దార్ కార్యాలయం వద్ద బర్లీ పొగాకు రైతుల ఆందోళన



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు, నాయకులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

బర్లీ పొగాకును గతేడాది ధరకే కంపెనీలు కొనాలని లేదా మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని పొగాకు రైతులు డిమాండ్ చేశారు. బర్లీ పొగాకును పొగాకు బోర్డు పరిధిలో చేర్చాలని, నల్లబర్లీ పొగాకు కొనుగోలుకు మార్కెట్‌ను ప్రారంభించాలని కోరారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతుసంఘాల ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు మాట్లాడుతూ ఈ సమస్యపై సిఎం చంద్రబాబును కలిసి విన్నవించగా కంపెనీలతో మాట్లాడి కొనేలా చేస్తామని చెప్పినా ఇంత వరకు చర్యలు తీసుకోలేదన్నారు. పొగాకు కంపెనీల షేర్లు, పొగాకు ఉత్పత్తుల ధరలు పెరుగుతున్నా రైతులకు మాత్రం అవి దక్కడం లేదన్నారు. అప్పులు చేసి మరీ రైతులు పొగాకును సాగు చేయగా ఐటిసి, జిపిఐ, దక్కన్ తదితర కంపెనీలు ప్రత్యక్ష కొనుగోలును ఆపేశాయని, ఏజెంట్ల ద్వారా అతితక్కువ ధరకు అడుగుతున్నాయని విమర్శించారు. గతేడాది క్వింటాళ్ ధర రూ.15-18 వేలుంటే ఇప్పుడు రూ.3 వేలు-4,500 మధ్య ఉందన్నారు. చిలకలూరిపేట, పర్చూరు, బాపట్ల ప్రాంతాల్లో రైతుల ఆందోళన వల్ల బాపట్ల జెసి స్పందించారని, కంపెనీలను, రైతుసంఘాలను గతనెల 28న సమావేశపర్చారని తెలిపారు. ఆ సందర్భంగా 10 రోజుల్లో కొనుగోలు ప్రారంభిస్తామని కంపెనీల మేనేజర్లు చెప్పినా ఇప్పటికీ కదల్లేదన్నారు. సమస్యను అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రస్తావించినా ప్రభుత్వం పట్టించుకోలేదని చెప్పారు.

సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బర్లీ పొగాకు సాగులో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలు ఖ్యాతిగడించాయని, పంటను తాము కొంటామని చెప్పి సాగు చేయించినవారు ఇప్పుడు వాయిదా వేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ మాట్లాడుతూ గతేడాది 50 బిలియన్ల కిలోల పొగాకు కొనగా ఈ ఏడాది అసలు ప్రారంభించలేదని, ఇలా చేస్తే రైతు ఆత్మహత్యలు ఎందుకు పెరగవని నిలదీశారు. ఆలస్యం చేసే కొద్దీ రంగుమారి ధర పూర్తిగా పడిపోతుందని ఆందోళన వెలిబుచ్చారు. అనంతరం రైతుసంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు టి.బాబురావు, గిరిజన సంఘాల రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీనునాయక్, విసికె పార్టీ నాయకులు వి.ముత్తయ్య మాట్లాడారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మొహమ్మద్ హుస్సేన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ధర్నాలో వివిధ సంఘాల నాయకులు టి.ప్రతాపరెడ్డి, టి.సుబ్బారెడ్డి, బి.కోటనాయక్, జె.రాజశేఖర్ పాల్గొన్నారు.

కొంటామని కంపెనీలు చెప్పాకే సాగు

కంపెనీలు చెప్పడంతో ఐదెకరాల్లో పొగాకు సాగు చేశాను. ఇప్పుడు కొనడానికి కనుచూపుమేరలో కూడా వారు కనిపించడం లేదు. ఎకరాకు రూ.1.25 లక్షల ఖర్చవగా దళారులు వచ్చి క్వింటాళ్ రూ.3 వేలు, రూ.4500కు అడుగుతున్నారు.

పాముల సుందరావు, యడ్లపాడు మండలం, తుర్లపాడు.

ప్రతిఏటా 50 ఎకరాల వరకూ వివిధ రకాల పంటలేస్తాను. గతేడాది 15 ఎకరాల్లో పొగాకు వేయగా కాస్త లాభం వచ్చిందని, ఈ ఏడాది 20 ఎకరాల్లో వేశాను. ఎంత సాగు చేసినా కొంటామని మొదట్లో చెప్పిన కంపెనీలు ఇప్పుడు ముఖం చాటేశాయి. పంట చేతికొచ్చిన రెండు నెలల్లో అమ్ముకోకుంటే రంగుమారి ధర పడిపోతుంది. అదే జరిగితే తీవ్రంగా నష్టపోతాం.

పావులూరి శివాజీ, యడ్లపాడు మండలం, తుర్లపాడు.

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం

మాచర్లలో తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ముస్లిములు

ప్రజాశక్తి - మాచర్ల

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే కాకుండా మైనారిటీల మతపరమైన హక్కులకు ముప్పు కలిగిస్తుందని ముస్లిమ్ మైనార్టీలు ఆందోళన వ్యక్తంచేశారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆల్ ఇండియా ముస్లిం లాబోర్డు (ఎఐఎంపిఎల్‌బి) పిలుపు మేరకు బుధవారం మాచర్ల పట్టణంలో వెయ్యిమందికిపైగా ముస్లిములు నల్లజెండాలు, నల్ల బ్యాడ్జీలతో భారీ ర్యాలీ చేశారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో ప్రదర్శనతోపాటు వక్ఫ్ బోర్డు భూములపై కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టాన్ని రద్దు చేయాలని నినాదాలు చేశారు. రాజ్యాంగాన్ని కాపాడాలని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. స్థానిక నూర్ మజీద్ నుండి రింగ్ రోడ్డు సెంటర్ వరకు సాగిన ర్యాలీలో పలువురు మాట్లాడుతూ భారతీయ ముస్లిముల మతపరమైన, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక గుర్తింపును బలహీనపరిచే అవకాశం కల్పించేలా కేంద్రం తెచ్చిన చట్టం ఉందన్నారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం అని ప్రపంచానికి చాటిన ప్రజల మధ్య మతోన్మాద పార్టీలు చిచ్చు పెట్టాలని చూస్తున్నాయని విమర్శించారు. దేశంలోని అన్ని మతపరమైన మైనారిటీల హక్కులకు దీర్ఘకాలిక ముప్పును తెస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను చొప్పిస్తే ముస్లిముల మాటకు విలువ ఏముంటుందని ప్రశ్నించారు. వక్ఫ్ ట్రిబ్యునల్‌ను నిర్వీర్యం చేసి, ప్రభుత్వ మాట వినే కలెక్టర్‌కు, ఏ ఆస్తి ఎవరిదని నిర్ణయాధికారం ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు.

కారంపూడిలో తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ముస్లిములు

రాజ్యాంగ మౌలిక హక్కులకు విరుద్ధంగా ఉన్న ఈ వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రజాశక్తి కారంపూడి

స్థానిక చెక్ పోస్ట్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ముస్లిములు ర్యాలీ చేశారు. తహశీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం ద్వారా ముస్లిములకు కేంద్ర ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందన్నారు.

ప్రైవేట్ ఏజెన్సీలు వద్దు.. ఆప్కాస్‌ను రద్దు చేయొద్దు

ఎంటిఎంసి కార్యాలయం వద్ద క్లాప్ ఆటో డ్రైవర్లు, మున్సిపల్ కార్మికులు ధర్నా

కార్పొరేషన్ కార్యాలయానికి గేటుకు తాళం వేయడంతో బైటాయించిన కార్మికులు,

డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి : ప్రైవేటు ఏజెన్సీలు వద్దు... ఆప్కాస్‌ను రద్దు చేయొద్దు అంటూ మున్సిపల్ కార్మికుల ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని కోరుతూ బుధవారం ఏపీ మున్సిపల్ అండ్ వర్కర్స్ యూనియన్, క్లాప్ ఆటో డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఎం టి ఎం సి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు ఎం రవి మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న ఆప్కాస్‌ను తొలగించి ,మున్సిపల్ కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విషవాయువులను పీల్చుకుంటూ ,ప్రజల ఆరోగ్యం కోసం, పర్యావరణం ను కాపాడుతున్న మున్సిపల్ కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తే కార్మికులకు పని భద్రత ఉండదని, జీతాలు సక్రమంగా చెల్లించకుండా ఏజెన్సీలు కార్మికులను ఇబ్బందులు పెడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆప్కాసును తొలగించడం అనివార్యమైతే మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని రవి డిమాండ్ చేశారు. ఒక ప్రక్క మున్సిపల్ కార్మికులనుఫ్రంట్ లైన్ వారియర్స్ అని పొగుడుతూ ,వారు కాళ్లు కడిగి నీళ్ల నెత్తిన చల్లుకుంటూ, శాలువాలు కప్పు తు మరో ప్రక్క వారు పోరాడి సాధించుకున్న హక్కులను కాల రాయాలని చూస్తే సిఐటియు చూస్తూ ఊరుకోదని రవి హెచ్చరించారు.తమ సమస్యలు చెప్పుకునేందుకు ప్రజలను మున్సిపల్ కార్యాలయంలోనికి రానివ్వకుండా పట్ట పగలుమున్సిపల్ కార్యాలయాల గేట్లకు అధికారులు తాళాలు వేయించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఇటువంటి అప్రజా స్వామిక చర్యలను చైతన్యవంతమైన మంగళగిరి ప్రజలు అంగీకరించరని అన్నారు.కార్యాలయ గేట్లకు తాళాలు వేయించేందుకు సూపే శ్రద్ధ మున్సిపల్ కార్మికులకు రక్షణ పరికరాలు మాస్కులు, గ్లౌజులు, సబ్బులు, నూనెలు, చెప్పులు ,యూనిఫామ్ ఇచ్చే విషయంలో అధికారులు ఎందుకు చూపించడం లేదని రవి ప్రశ్నించారు.తక్షణం ఎం టి ఎంసీ అధికారులు మున్సిపల్ కార్మికులకు పెండింగ్ ఉన్న సబ్బులు, నూనెలు, మాస్కులు, గ్లౌజులు, చెప్పులు, యూనిఫామ్ ఇవ్వాలని రవి డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు వివి జవహర్ లాల్ మాట్లాడుతూ క్లాప్ ఆటో డ్రైవర్లు, మున్సిపల్ కార్మికుల సమస్యలను అధికారులు పరిష్కరించాలని కోరారు.క్లాప్ ఆటో డ్రైవర్లకు 16 నెలలుగా పెండింగ్ ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ వారి ఖాతాలలో జమ చేయాలని అన్నారు.కార్మికులకు ఇబ్బంది కలిగించాలని చూస్తే సిఐటియు అన్ని రంగాల నుండి కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని జవహర్ లాల్ హెచ్చరించారు.సిఐటియు నాయకులు బాలాజీ మాట్లాడుతూ కార్మికులు సంఘటితమై సమస్యల పరిష్కారం కొరకు పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఆర్ వేణు, సిఐటియు నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, పల్లె కఅష్ణ, వెంగమ్మ ,చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకఅష్ణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మంగయ్య, ఏసు, సుందర్రావు క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు రవి, శివ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దయా రమాదేవి

మే 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గుంటూరు

లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు మే 20న జరిగే దేశవ్యాపిత సమ్మె నినాదాన్ని వాడవాడలా తీసుకెళ్లాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి పిలుపునిచ్చారు. బుధవారం పాత గుంటూరు సిఐటియు జిల్లా కార్యాలయంలో యూనియన్ జిల్లా ఆఫీస్ బ్యారర్స్ సమావేశం జరిగింది. సమావేశానికి జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ దేశ నిర్మాణంలో ముఖ్యభూమిక పోషించే కార్మికుల పట్ల కేంద్రం దుర్మార్గంగా వ్యవహరిస్తూ, కార్పొరేట్లకు లాభం చేకూర్చే విధానాలు అనుసరిస్తుందన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు ప్రశ్నించే హక్కును కాలరాస్తుందని, కార్మికులకు కనీస హక్కులను కూడా కల్పించట్లేదన్నారు. సమావేశంలో జిల్లా కోశాధికారి ఎం.సాంబశివరావు, జిల్లా ఉపాధ్యక్షులు వేముల దుర్గారావు, కె.బాబుప్రసాద్, షేక్.హుస్సేన్ వలి, జిల్లా కార్యదర్శులు వై.నేతాజీ, వై.రమణ, బి.ముత్యాలరావు, ఎస్.ఎస్. చెంగయ్య, సిహెచ్ నాగ బ్రహ్మాచారి, ఎం.భాగ్యరాజు, నిమ్మకూరు రమేష్ బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - చేబ్రోలు

బుధవారం వేజెండ్ల గ్రామపంచాయతీ పరిధిలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో 2025 -26 ప్రవేశాలు (అడ్మిషన్లు)కు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించినట్లు పాఠశాల మండల విద్యాశాఖ అధికారి ఆర్ సుబ్బారావు తెలిపారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రముని, స్టేప్ సీఈవో, మండల విద్యా శాఖ అధికారి ఆర్ సుబ్బారావు పాల్గని మాట్లాడారు . ప్రభుత్వ పాఠశాలలలో ఉన్నత విద్యా అర్హత కలిగిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులుతో ఐ ఎఫ్ వి , స్మార్ట్ టీవీల ద్వారా గుణాత్మకమైన విద్యా బోధన జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్చిన వారికి ప్రతి విద్యార్థికి 15 వేల రూపాయలు చొప్పున తల్లికి వందనం పథకం అందుతుందన్నారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో జడ్‌పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు టి. విజయశ్రీ, పి.శ్రీనివాసమూర్తి, లక్ష్మి పద్మావతి, పి.దీప్తి, నస్రిన్, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వరావు, జి. వెంకటేశ్వరరావు, సిఆర్‌పి సంపూర్ణ, వేజెండ్ల లోని అన్ని పాఠశాలల కమిటీ చైర్మన్లు, సభ్యులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ కార్మికుల్ని పర్మినెంట్ చేయాలి

ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - గుంటూరు : మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల్ని పర్మినెంట్ చేయాలని కోరుతూ సిఐటియు అనుబంధ మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేసి, ప్రైవేటు ఏజెన్సీలకు కార్మికుల్ని అప్పగించే పాత విధానాన్ని పునరుద్ధరించాలని ఆలోచించటం సరికాదన్నారు. ఇప్పుడున్న వ్యవస్థ కంటే మెరుగైన వ్యవస్థను ఏర్పాటు చేయకుండా అధ్వాన్న పరిస్థితులు సృష్టించే విధానాలు చేపట్టటం సరికాదన్నారు. ప్రభుత్వానికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల పట్ల చిత్తశుద్ధి ఉంటే వారిని పర్మినెంట్ చేయటమే ఉత్తమైన పరిష్కారం అన్నారు. అలాగే మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంపుదలకు 9మంది ఐఎఎస్ అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక ప్రకారం జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. 2023 డిసెంబర్, జనవరిలో జరిగిన 16 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు జిఓలు ఇవ్వాలని పలుమార్లు విన్నివించినా ప్రభుత్వం స్పందించట్లేదన్నారు. తక్షణమే జిఒలు విడుదల చేయాలని కోరారు. కాగా మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా 60 ఏళ్లు నిండాయని రిటైర్మెంట్ చేశారని, వారికి ఎలాంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కానీ, చట్ట ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వలేదని, ఇది చట్ట ఉల్లంఘన అవుతుందని అన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే కార్మికులందర్నీ ఐక్యంచేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని, అవసరమైతే నిరవధిక సమ్మెకు కూడా వెనకాడమని హెచ్చరించారు. ధర్నా అనంతరం జిఎంసి మేనేజర్ శివన్నారాయణకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో యూనియన్ నగర అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు, నాయకులు కుంభా శివయ్య, కారసాల శౌరమ్మ, పచ్చల సామ్రాజ్యం, కాళంగి భాగ్యరాజు, కె.మరియదాసు, నరేంద్ర, శ్రీనివాసరావు, సురేష్‌బాబు, నిర్మల, రాంకోటమ్మ, చెంచయ్య, షేక్.రసూల్ పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో మహావీర్ కాలేజి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గుంటూరు

ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ జి.జయలక్ష్మి తెలిపారు. కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా తమ విద్యార్థులు రాణించటం అభినందనీయని కళాశాల సెక్రటరీ షా లలిత్‌కుమార్‌జైన్ పేర్కొన్నారు.సీనియర్ ఇంటర్ ఎంఇసిలో ఎ.పూజిత 972, ఎంపిసిలో ఎస్.జగదీశ్వరి 970, యస్ రాధాకఅష్ణ 970, సిఇసిలో యస్.కె.అఫ్రిన్ 947 మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఇంటర్ సిఇసిలో పి.సామంత్ 460 మార్కులు, ఎంపిసిలో జి.నందిని 450 మార్కులు సాధించారని తెలియజేశారు. మొదటి సంవత్సరం లో 400కుపైన, ద్వితీయ సంవత్సరంలో 900కు పైన మార్కులు సాధించిన విద్యార్థులు అత్యధికంగా తమ కళాశాలలో వున్నారని ప్రిన్సిపాల్ చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

మణిపాల్‌లో విజయవంతంగా కాలేయ మార్పిడి శస్త్రచికిత్స

- మణిపాల్‌లో విజయవంతంగా కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స
- దేశంలోనే మొదటిసారి కాలే మార్పిడి శస్త్ర చికిత్స చేసిన ఐదు రోజుల్లోనే రికవరీ

ప్రజాశక్తి-తాడేపల్లి

మణిపాల్ హాస్పిటల్ - సౌత్ ఏషియన్ లివర్ ఇనిస్టిట్యూట్ భాగస్వామ్యంతో కాలేయ మార్పిడి (ఇఆర్ఏఎస్) శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు మణిపాల్ హాస్పిటల్ లివర్ ట్రాన్స్ ప్లాంట్ ప్రోగ్రాం హెడ్ ప్రఖ్యాత లివర్ సర్జన్ ప్రొఫెసర్ డాక్టర్ టామ్ చెరియన్ అన్నారు. బుధవారం తాడేపల్లి బైపాస్ రోడ్డు మణిపాల్ హాస్పిటల్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ టామ్ చెరియన్ మాట్లాడుతూ కేవలం ఐదు రోజుల్లోనే కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతం చేసి రోగిని సురక్షితంగా ఇంటికి పంపించిన ఘనత మణిపాల్‌కే దక్కుతుందని తెలిపారు. కాలేయం శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచే అవయవాల్లో ప్రధానమైనదని తిన్న ఆహారం జీర్ణం అవ్వాలన్నా, శరీరానికి శక్తి సరిగ్గా అందాలన్నా, విష పదార్థాలు బయటికి వెళ్లాలన్నా లివర్ సరిగ్గా పనిచేయాలని చెప్పారు. మణిపాల్ హాస్పిటల్ సౌత్ ఏషియన్ లివర్ ప్రోగ్రాంలో లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ చేయించుకున్న 60 మంది రోగులలో దాదాపు 13 మంది రోగులు ఈ కొత్త ఈఆర్ఏఎస్ కార్యక్రమం నుండి విజయవంతంగా ప్రయోజనం పొందారని తెలిపారు. మణిపాల్ హాస్పిటల్ సౌత్ ఏషియన్ లివర్ ఇన్స్టిట్యూట్ భాగస్వామ్యంతో గత మూడు సంవత్సరాలుగా కోస్టల్ ఆంధ్ర ప్రదేశ్ ప్రజలకు సేవలు అందిస్తుందని మణిపాల్ హాస్పిటల్ క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటేపూడి అన్నారు. తక్కువ సమయంలోనే మణిపాల్ హాస్పిటల్ కాలయ వ్యాధికి అత్యుత్తమ కేంద్రంగా మారిందని అన్నారు. గత సంవత్సరం రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో కాలేయ మార్పిడిని మణిపాల్ హాస్పిటల్ నిర్వహించిందని అన్నారు. అలాగే పిల్లలలో అత్యధిక సంఖ్యలో కాలేయ మార్పిడిని నిర్వహించినట్లు తెలిపారు. గత కొన్ని నెలల క్రితం పనిచేయని కాలయ క్యాన్సర్ తో బాధపడుతున్న నాలుగు సంవత్సరాల బాలుడికి జీవించి ఉన్న దాత కాలేయ మార్పిడిని విజయవంతంగా మణిపాల్ హాస్పిటల్ శస్త్ర చికిత్స నిర్వహించిందని అన్నారు. సాధారణ జీవితంలోకి వస్తున్న రోగులకు మణిపాల్ హాస్పిటల్ బఅందం వారి ఆరోగ్యం శ్రేయస్సుకు భరోసా ఇవ్వడంలో అంకిత భావంతో పనిచేస్తుందని అన్నారు.

కందుకూరికి ఘన నివాళి

ప్రజాశక్తి, పెదనందిపాడు

తెలుగు జాతి నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశ లింగం అని ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు గేరా మోహనరావు అన్నారు. వీరేశలింగం 177వ జయంతిని పురస్కరించుకుని స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ తొలి వితంతు వివాహాన్ని జరిపించిన ధీరుడు, తొలి తెలుగు నాటక ప్రదర్శన చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆనాటి సమాజంలోని మూఢనమ్మకాలపై పోరాటం చేసిన గొప్ప సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు అని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వహకురాలు పి.సుభాషిణి, విశ్రాంత ఉపాధ్యాయులు గుగ్గిలం సాయిబాబు, అన్నలదాసు విజేందర్ రావు, మేడూరి సుబ్బారావు, వెంకటేశ్వర్లు, సునీల్, మంజుల, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సంధ్యారాణితో మాట్లాడుతున్న దారునాయక్

గిరిజనుల అభివృద్ధికి తోడ్పాటునందించండి

రాష్ట్ర టిడిపి ఎస్‌టి సెల్ అధ్యక్షులు ఎం.దారునాయక్

ప్రజాశక్తి - విజయపురిసౌత్

పల్నాడు ప్రాంతంలోని గిరిజనుల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని రాష్ట్ర టిడిపి ఎస్టి సెల్ అధ్యక్షులు ఎం.దారు నాయక్ కోరారు. బుధవారం అమరావతిలోని సచివాలయంలో మంత్రిని కలిసి పలు సమస్యలను దారునాయక్ వివరించారు. వేసవి కాలం దష్ట్యా పల్నాడులోని గిరిజన తండాల్లో తాగునీటి సమస్యపై చర్యలు చేపట్టాలని కోరారు. 30 ఏళ్లుగా అటవీ భూముల్లో పంటలు సాగుచేసుకుంటున్న గిరిజనులకు పట్టాలను మంజూరు చేయాలని కోరారు.గిరిజన ప్రాంతాల్లో ఉండే నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని మంత్రికి విన్న వించారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకష్ణ దేవరాయలు చొరవతో పల్నాడు ప్రాంతంలో కారంపూడి, వినుకొండ, నరసరావుపేట ప్రాంతాల్లో రూ.17 కోట్లతో నిర్మించిన ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షి యల్ పాఠశాలల ప్రారంభోత్సవానికి విచ్చేయాలని మంత్రిని కోరారు.

అనధికార బోర్డులను స్వచ్ఛందంగా తొలగించుకోండి

మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పురపాలక సంఘ పరిధిలోని రోడ్డు మార్జిన్‌లలో వ్యాపారాలకు సంబంధించిన అనధికార బోర్డులను వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. షాపులకు సంబంధించిన అనధికార బోర్డులను ఫుట్‌పాత్‌లు, డ్రైనేజీలను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారనీ, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. ఈనెల 21 నుంచి రోడ్డు మార్జిన్, ఫుట్ పాత్‌లు, డ్రైనేజీలను ఆక్రమించి ఏర్పాటు చేసిన వాటిని తొలగిస్తామనీ, కావున ఆక్రమణ దారులు స్వచ్ఛంధంగా వారి బోర్డులను తొలగించుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఎలాంటి నోటీసులు లేకుండా పురపాలక సంఘం, పోలీస్‌శాఖ సంయుక్తంగా ఆక్రమణలను తొలగిస్తామని హెచ్చరించారు.

పత్తి విత్తనాల ప్యాకెట్లను అధికారులు తనిఖీ

ప్రజాశక్తి- రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలోనే పత్తి విత్తన దుకాణాలను కమిషనర్ కార్యాలయం వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్. శశిధర్ రెడ్డి బుధవారం సందర్శించారు. వివిధ కంపెనీలకు చెందిన పత్తి ప్యాకెట్లను పరిశీలించారు ఈ తనిఖీల్లో కలుపు మందుల బిటి టెస్టు నిర్వహించగా నెగటివ్ రిపోర్టు రావడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. విత్తనాలను కొనుగోలు చేసిన వెంటనే తప్పనిసరిగా రసీదు ఇవ్వాల్సిందేనని ఆదేశించారు.తనిఖీల్లో వ్యవసాయ అధికారులు బోయపాటి బ్రహ్మారెడ్డి వి ఎస్ సురేష్ రాంబాబు నాయక్ పాల్గొన్నారు.

రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది

పజాశక్తి - మాచర్ల రూరల్ :

నారా చంద్రబాబునాయుడు అధికార పగ్గాలు చేపట్టాక రాష్ట్రం అభివృద్ధివైపు అడుగులు వేస్తోందని మాచర్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లిఖార్జునరావు అన్నారు. బుధవారం తన కార్యాలంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో యాగంటి మాట్లా డుతూ ఐదేళ్ళు ముఖ్యమంత్రిగా చేసిన జగన్ రాష్ట్ర వృద్ధిరేటును పాతాళానికి తొక్కాడన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా కుదేలై పారిశ్రామికంగా ఒక్క పరిశ్రమ రాష్ట్రానికి రాలేదన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక వృద్ధిరేటు అభివృద్ధి వైపు పరుగులు తీస్తోంది. గత ప్రభుత్వంలో దేశంలోనే అట్టడుగు స్థాయిలో ఉన్న వృద్ధిరేటు ప్రస్తుత ఆశాజనకంగా రెండో స్థానానికి చేరడం చంద్రబాబు పనితీరుకు నిదర్శనమన్నారు. 15శాతం వృద్ధిరేటుతో దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలవడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సమావేశంలో తిక్క కొండలు, దుర్భకులప్రసాద్, బ్రహ్మం, గాజులఅంజి, మస్తాన్, బొట్టు కోటేశ్వరరావు, శివ పాల్గొన్నారు.

దళితుల అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఎస్.సి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సాతులూరి కుమార్

మాట్లాడుతున్న దళిత నాయకులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దళితుల సంక్షేమానికి, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని దళితుల అభివృద్ధి కూటమి ప్రభుత్వం ద్వారా సాధ్యమని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు రుజువు చేశారని ఎస్‌సి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సాతులూరి కుమార్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఇన్నగంటి జగదీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టాకిరణ్ నరసరావు పేట పట్టణంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్‌సి ఉప వర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో రాజీవ్ రంజాన్ మిశ్రా ఇచ్చిన నివేదిక, దాని పై మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదిక పై కేబినెట్ చర్చించి, వీటి ప్రకారం 200పాయింట్ల రోస్టర్ అమలుకు నిర్ణయించిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఎస్‌సి వర్గీతకరణ వివాదం మొదలైందన్నారు. మాల, మాదిగ సహా 59 కులాలు, ఉపకులాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో షెడ్యూల్డ్ కులాలుగా గుర్తించారన్నారు. ఎస్‌సి ఉప వర్గీక రణ కింద గ్రూప్-1లో 12 ఉపకులాలకు 1శాతం, గ్రూప్-2లో 18 ఉపకులాలకు 6.5 శాతం, గ్రూప్-3లో 29 ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా ఆమోదంతో అందరికి న్యాయం జరుగుతుందని అన్నారు. ఏ- గ్రూపులో రెల్లి సహా 12కులాలు బి- గ్రూపులో మాదిగ సంబంధిత 18కులాలు, సి- గ్రూపులో మాల కులస్తులతో పాటు మరో 24 కులాలు, డి- గ్రూపులో ఆది ఆంధ్ర కులాలను చేర్చారన్నారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఎస్.సి, ఎస్.టి వర్గీకరణ అవసరమని ధర్మాసనం తుది తీర్పు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు జి.పి కుమార్ దళిత నాయకుడు ఎం.ప్రభాకర్ పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి అధికారులు బాధ్యత తీసుకోవాలి : చీఫ్ విప్ జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

ప్రజాదర్బార్‌కు వచ్చే ప్రతి అర్జీని పరిశీలించి, సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అధికారులను ఆదేశించారు. ప్రజల ఇబ్బందులు తీర్చడమే కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యమని, ఆ విషయంలో అలసత్వాన్ని సహించేది లేదన్నారు. వినుకొండ పట్టణంలోని చీఫ్‌విప్ ఆఫీస్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్ సందర్భంగా బుధవారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను నేరుగా విన్నారు. సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ చర్యలు తీసుకునే దిశగా ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రెవెన్యూ, డ్రైనేజీ, నీటి సరఫరా, మౌలిక సదుపాయాలు, గ్రామీణ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఎక్కువగా వినతులు వచ్చాయన్నారు.

సమస్య వింటున్న ఎమ్మెల్యే ఆంజనేయులు

నీటి సమస్యలు, డ్రైనేజీ బ్లాకేజీపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించి భూరికార్డులు సరి చేయడంపైనా వేగంగా స్పందించాలన్నారు. ప్రతి గ్రామంలో సాగునీరు, తాగునీరు అందించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. ప్రజల నమ్మకమే కూటమి ప్రభుత్వం బలమని తెలిపారు.

ముఖ్యమంత్రి ఆలోచనల్ని అధికారులు గుర్తించకపోతే ఎలా?

ప్రజాదర్బార్‌లో శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు

ప్రజాశక్తి - నాదెండ్ల

గత ప్రభుత్వ భూ తప్పిదాలు.. రెవెన్యూ సమస్యలు నేడు రైతుల మెడకు చుట్టుకొని వారిని ఇబ్బంది పెడుతున్నాయని, సమస్యలు పరిష్కరించకుండా చేసినట్లు మోసం చేయడం సరికాదని మాజీమంత్రి, శాసన సభ్యులు ప్రత్తి పాటి పుల్లారావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న మాజీమంత్రి దృష్టికి రైతులు తమ భూములను నిషేధిత జాబితాలో చేర్చడంపై ఫిర్యాదు చేశారు. రైతులు తెలియచేసిన సమస్యపై ప్రత్తిపాటి తీవ్రంగా స్పందించారు. నాదెండ్ల మండలంలోనే రైతుల భూములు 17 వేల ఎకరాలు నిషేధిత భూముల జాబితాలోకి (22ఏ, ఇనామ్) చేర్చబడ్డాయని, సమస్యను మండలస్థాయి అధికారులు గుర్తించకపోవడంపై ప్రత్తిపాటి తీవ్ర అసహ నం వ్యక్తం చేశారు. అనధికారలేఅవుట్లను ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమణ, ఎంపీడీవో స్వరూపరాణి, ఎంపీపీ తలతోటి రాణి, విద్యుత్ ఏ.డి కొండలు, సిఐ సుబ్బానాయుడు, నాయకులు నెల్లూరి సదాశివరావు, బండారుపల్లి సత్యనారాయణ, నల్లమోతు హరిబాబు, మొగిలి నాగలక్ష్మి, గంగాశ్రీనివాసరావు, హిమవంత్‌రావు, కందుల రమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి

రొంపిచర్లలో పౌష్టికాహార పక్షోత్సవం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : మండల కేంద్రం రొంపిచర్లలో అంగన్వాడీ కేంద్రం-1 లో బుధవారం పౌష్టికాహార పక్షోత్సవం జరిగింది. పిల్లల బరువులు, ఎత్తు గురించి తెలుసుకుని, బరువు తక్కువ పిల్లలు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. బాల సంజీవనియాప్‌లో ఈ వచ్చిన నూతన అప్లికేషన్‌లో గర్భిణీ స్త్రీలు, బాలింతలు, మూడేళ్లలోపు పిల్లలు, తల్లులప్లేస్, రిజిస్ట్రేషన్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసిడియస్ సూపర్‌వైజర్లు కె.శశిదేవి, దేవిభాయి, షమ్మి, అంగ న్వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, తల్లులు, గర్భిణీలు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలే లక్ష్యాలు

ఎక్సైజ్ ఇన్‌ఫోర్సు మెంట్ అసిస్టెంట్ కమిషనర్

ప్రజాశక్తి - మాచర్ల :

నాటుసారా రహిత గ్రామాలే లక్ష్యంగా నవోదయం కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌ఫోర్సు మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.రవికుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం మాచర్ల ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ తొమ్మిది సారాప్రభావిత గ్రామాలుగా గుర్తించామని, ఆయా గ్రామాల్లో సారా తయారీ, సారా తాగటం వలన కలిగే అనార్థాలను నవోదయం కార్యక్రమం ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సారా తయారీదారులు 78 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని, మూడు నెలలో నాటు సారా తయారీకి ఉపయోగించే 10వేల లీటర్ల బెల్లం ఊట ను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. విలేకర్ల సమావేశంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.రవీంద్ర, ఏఈఎస్‌జి సూర్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రవి కుమార్ రెడ్డి

పత్తి విత్తన దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

విత్తన దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

హెచ్‌పీ పత్తి విత్తనాలకు రాష్ట్రంలో అనుమతి లేదని పత్తి విత్తనాలను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎడిఎ, ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్, ఆర్.శశిదర్ రెడ్డి దుకాణదారులను హెచ్చరించారు. సత్తెనపల్లి పట్టణంలోని పలువిత్తన దుకాణాలను గుంటూరు కమిషనర్ కార్యాలయం ఇంటిగ్రేటెడ్ అగ్రల్యాబ్ ఎడిఎ కమిషనర్ వ్యవసాయ అధికారి వి.ఎస్. సురేసన్ బుధవారం ఆకస్మిక తనిఖీలు చేసారు. ప్రత్తి విత్తనాల నిల్వలు వచ్చిన వెంటనే సదరు విత్తన డీలర్లు మండల వ్యవసాయాధికారి వారికి తెలియజేసి వారి అనుమతి మేరకు విక్రయాలు జరపాలని ఆదేశించారు. ప్రతి విత్తన డీలర్ రైతులకు తప్పనిసరిగా విత్తన కొనుగోలు రసీదు ఇవ్వాలని సూచించారు. తనిఖీలలో సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్లను ప్రారంభిస్తున్న ఎంఈవోలు

ప్రభుత్వ పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

పట్టణంలోని వీరభద్రపురం మండల పరిషత్ ప్రాథ మిక పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు ఆర్వోప్లాంట్లను మండల విద్యాశాఖాధికారులు షేక్ జఫ్రుల్లఖాన్, అల్లి సురేష్ బుధవారం ప్రారంభించారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొన్న ఎఈవోలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయనీ, తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాదే కిరీటి రెడ్డి సభకు అధ్యక్షత వహించారు. ఎస్ఎంసి కమిటీ చైర్మన్ కొమెర శాంతికుమారి, సాగర్‌బాబు, పాఠశాల సిబ్బంది ఎస్కే రెహనా నాగమణి, ఉషారాణి, నిర్మల మేరీ, ఆదిలక్ష్మి, సిహెచ్ కొర్లయ్య, కేశవరెడ్డి, ఏడు కొండలు, నాగరాజు, ఉప్పుతోళ్ల ఏడుకొండలు పాల్గొన్నారు.

గుడిపూడిలో ర్యాలీలో అధికారులు, గ్రామ పద్ధతులు

రీసర్వేతో భూవివాదాలు పరిష్కారం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

భూ వివాదాల ప్రక్షాళనకు రీ సర్వే ఉపయోగపడుతుందని సత్తెనపల్లి మండల తహశీల్దార్ కె ఎస్ చక్రవర్తి అన్నారు. సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలో రెండో విడత భూ రీసర్వే పనులను తహశీల్దార్ చక్రవర్తి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో చేపట్టిన భూ సర్వేను తిరిగి సుమారు 115 సంవత్సరముల తరువాత ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ-సర్వే చేస్తోందని చెప్పారు. ప్రతి రైతు వారి హక్కు పత్రములతో వారి సర్వే నంబర్లలో సర్వే జరుగుతున్నప్పుడు హజరై తమ భూ-సమస్యలు పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో ర్యాలీ, గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో రీ-సర్వే డిప్యూటీ తహశీల్దార్, ఎన్.రవికుమార్, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ బోసుబాబు, మండల సర్వేయర్.. విజయ్‌కుమార్, గ్రామ పెద్దలు లగడపాటి గజానన, సర్పంచ్ తిరుపతిరావు ఎంపిటీసి మర్రి పూర్ణయ్య,గద్దే ఆంజనేయులు, కోనకంచి పుల్లారావు, గ్రామపెద్దలు, సర్వేయర్లు, గ్రామ రెవిన్యూ అదికారులు, రైతులు పాల్గొన్నారు.

గీతాంజలి కుటుంబానికి అండగా ఉంటాం

ప్రజాశక్తి - తెనాలి

ఐ టి డి పి సోషల్ మీడియా వేధింపులకు బలైన గీతాంజలి కుటుంబానికి అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ఎన్నికలకు ముందు వైసిపి అధికారంలో ఉండగా ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గన్న గొల్తి గీతాంజలి ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. అప్పట్లో వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా ఆమె మాట్లాడినందుకు ఐ టీడీపీ ఆమెను రకరకాలుగా ట్రోలింగ్ చేసినందుకు మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అప్పట్లో బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించి, వైసీపీ అధినేత జగన్ ఆదేశాల మేరకు చెరో

ఆర్థిక సాయం అందజేస్తున్న శివకుమార్, తదితరులు

పది లక్షల చొప్పున శివకుమార్ ఆధ్వర్యంలో పిల్లల పేరిట డిపాజిట్ చేసిన సంగతి తెలిసిందే. అలాగే బుధవారం వైసిపి సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు దొడ్డ అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షులు కొరిటిపాటి ప్రేమ్ కుమార్ ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు తెనాలి వచ్చారు. వైసిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే శివకుమార్ తో కలిసి బాధిత కుటుంబాన్ని కలిసి రూ.50వేల నగదును ఆర్థిక సాయంగా అందించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ఇప్పటికైనా గీతాంజలి మఅతికి కారణమైన దోషులను శిక్షించాలని కోరారు. అంజిరెడ్డి, ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ పార్టీ తరఫున ఆ కుటుంబానికి అండగా ఉంటామని జగన్ హామీ ఇచ్చారని, ఆమేరకు ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ సోషల్ మీడియా నాయకులు గాదె యస్వంత్ రెడ్డి, మేకా వేంకట్రామి రెడ్డి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణి చేస్తున్న సిని దర్శకులు దిలీప్ రాజా

గిరిజనులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - తెనాలిరూరల్

ఊరికి దూరంగా కాల్వకట్టలపై జీవిస్తున్న నిరుపేద గిరిజనులకు మా ఎపి వ్యవస్థాపకులు దిలీప్ రాజా బుధవారం నూతన వస్త్రాలు, నిత్యవసరాలు పంపిణి చేశారు. ఫర్ ది లీస్ట్ ఆఫ్ దేం స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు అంజలి రావూరు ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో దిలీప్ రాజా ముఖ్య అతిథిగా పాల్గన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊరికి దూరంగా, కాల్వకట్టలపై నివాశాలు ఏర్పాటుచేసుకున్న గిరిజనులకు ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ నుంచి పునరావాసాలను కల్పించాలని కోరారు. వారికి మెరుగైన జీవనశైలి, జీవిత ప్రమాణాలను సమకూర్చాల్సిన ఆవశ్యకత ప్రభుత్వంపై ఎంతైనా ఉందన్నారు. పలు వితరణ కార్యక్రమాల ద్వారా పేదలను ఆదుకుంటున్న సంస్థ అధ్యక్షురాలు రావూరి అంజలిని అభినందించారు.

134వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 134 రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఎన్ సుబ్బారావు, సిహెచ్.పిచ్చయ్య, కె.హగ్గయ్య, వై సాంబశివరావు, ఎం.గురవయ్య కూర్చున్నారు. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, టీ నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయ స్థానాలు తీర్పుల ప్రకారం కార్మికులకు న్యాయం చేయవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని చెప్పారు. ఆమెర కు చొరవ తీసుకొని వందలాది కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వై.యెహొషువ, వై.లాజర్ బాబు, ఎండి రహీమ్ తుల్లా, ఆర్ ఇస్రాయెల్, బి వెంకయ్య, ఎం.శివకుమారి, ఎస్.కె.ఇమాంబి, టి. దుర్గా భవాని, శారమ్మ, వై.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

19న జాబ్ మేళా

ప్రజాశక్తి - ఫిరంగిపురం

స్థానిక సెయింట్ జేవియర్ ఫార్మసీ కళాశాలలో ఈనెల 19వ తేదీన హైదరాబాద్ దివీస్ కంపెనీ వారు జాబ్ మేళా నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ డి.జీవన్ మణిబాబు బుధవారం తెలిపారు. 19వ తేదీన ఉదయం 9 నుండ 12 గంటల వరకు మేళా జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరారు. జాబ్ మేళాలో పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, బీఎస్సీ బీటెక్, బి ఫార్మసీ, ఎం. ఫార్మసి ఎమ్మెస్సీ సైన్స్ సంబంధించిన (2021-2024 మధ్య చదివిన) విద్యార్థిని విద్యార్థులు అర్హులన్నారు. అభ్యర్థులు ఎంపిక అదే రోజు నిర్వహించబడును. వివరాలకు 7842735467 ఫోన్ నంబర్లో సంప్రదించాలని కోరారు.

వృత్తిదారుల రాష్ట్ర మహాసభ జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తాడేపల్లి

ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని మంగళగి, తాడేపల్లి నగర కమిటీ అధ్యక్షులు ఉండవల్లి పార్థసారధి కోరారు. ఈనెల 20,21వ తేదీలలో కొండపల్లిలో జరిగే వృత్తిదారుల రాష్ట్ర 7వ మహాసభలను జయద్రం చేయాలని కోరుతూ బుధవారం ఉండవల్లిలో కరపత్రాలు పంచుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో రజక కార్మికులు, శ్రమ దోపిడీని భరిస్తున్నారని, అలాగే అపార్ట్మెంట్ వద్ద చిన్న సమస్య వస్తే దాడులు, దౌర్జన్యాలు ,అక్రమ కేసులు బనాయిస్తూ రజక వాచ్‌మెన్ వృత్తిదారులను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగే బహిరంగ సభలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గల్లా మాధవి , మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్,

పోస్టర్ ఆవిష్కరిస్తున్న వృత్తిదారులు

రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య, రాష్ట్ర కోశాధికారి వల్లభాపురం వెంకటేశ్వరరావు, రాష్ట్ర రజక సంఘం నాయకులు పాల్గని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నగర నాయకులు వల్లభాపురం మస్తాన్ రావు ,మునిపల్లి సాంబశివరావు, తాడేపల్లి శ్రీనివాసరావు, ధనుంజయ రావు, మల్లేశ్వరరావు, వల్లభాపురం శివపార్వతి, ఊరట చంచమ్మ, జ్యోతి, రవణమ్మ, జయమ్మ, వెంకటరత్నమ్మ, లక్ష్మి, రజక సోదరులు, రజక మహిళలు పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో పోషణ్ పక్వాడా పక్షోత్సవాలు

ప్రజాశక్తి - తెనాలిరూరల్

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ పక్వాడా పక్షోత్సవాలను మండల పరిధిలోని హాఫ్ పేట-1, బుర్రిపాలెం అంగన్వాడి కేంద్రాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. బాలింతలు, తల్లులకు వెయ్యి రోజుల సంరక్షణలో భాగంగా గర్భిణి దశనుంచి, బిడ్డకు రెండు ఏళ్ళు నిండేవరకూ పాటించాల్సిన నియమాలను హాఫ్ పేట సూపర్వైజర్ సి.హెచ్.హిమబిందు వివరించారు. స్త్రీలు, బాలింతలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తూ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. బుర్రిపాలెం అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు పోషకాహార లోపాలు, ఊబకాయం కారణంగా కలిగే అప్రయోజనాలను బుర్రిపాలెం సూపర్వైజర్ కె.యామిని వివరించారు. అనంతరం గర్భిణి స్త్రీలకు

హాఫ్ పేట అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార ప్రయోజనాలను వివరిస్తున్న సూపర్‌వైజర్ హిమబిందు

బరువుతీశారు. కార్యక్రమంలో హాఫ్‌పేట అంగన్వాడీ కార్యకర్త అంజనికుమారి, బుర్రిపాలెం కార్యకర్త ఎం.లక్ష్మీ, గర్భిణి స్త్రీలు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

నేడు ఆర్ట్స్ కామర్స్‌లా, సైన్స్, ఫార్మసీ కళాశాలల వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కామర్స్ లా ,సైన్స్, ఫార్మసీ కళాశాలల వార్షికోత్సవం గురువారం జరుగుతుందని ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా ఐఎఎస్ అధికారి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పీఆర్ & ఆర్‌డి కమీషనర్ ఎం.కృష్ణ తేజ హాజరవు తున్నారని తెలిపారు. గౌరవ అతిథిగా హైదరాబాదులోని సిఎస్‌బి ఐఎఎస్ అకాడమీ ప్రతినిధి ఎం.బాల లత పాల్గొం టారన్నారు. వార్షికోత్సవానికి అధ్యక్షులుగా వర్సిటీ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు వ్యవహరించ నున్నారని అన్నారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ప్రత్యేక అతిథితులు ఆచార్య ఆర్ వి ఎస్ ఎస్ ఎన్ రవి కుమార్ హాజరవుతారని చెప్పారు.. గౌరవ అతిథులుగా ,సైన్స్ కళాశాల ప్రాచార్యులు ఆచార్య కె వీరయ్య,ఫార్మసీ కళాశాల ప్రాచార్యులు ఆచార్య ఎ.ప్రమీల రాణి హాజరవుతారన్నారని కార్యక్రమ కన్వీనర్ ఆచార్య ఎమ్ త్రిమూర్తి రావు తెలిపారు.ఆచార్య సీ హెచ్ లింగరాజు, డాక్టర్ రవి శంకర్ రెడ్డి ఈ వార్షికోత్సవ కార్యక్రమ కన్వీనర్లుగా ఉండనున్నారని తెలిపారు. ఏఎన్‌యు తరంగ్

ప్రతి బుధవారం గ్రీవెన్స్ : ఎమ్మెల్సీ ఆలపాటి

ప్రజాశక్తి, -తెనాలిరూరల్

తెనాలి నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై ప్రతి బుధవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు కఅష్ణ గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టబద్రుల ఎమ్మెల్సి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం ప్రజలనుంచి పలు అర్జీలు స్వీకరించారు. గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిసిన అర్జీదారులు తమ సమస్యలతో సునామీ సఅష్టించారు. స్వీకరించిన వినతులను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని అన్నారు. అధికారుల ప్రమేయంతో సమస్యలను మరింత వేగంగా పరిస్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాస్

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పాత బస్టాండ్ సెంటర్లో కొమ్మారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని బుధవారం టిడిపి గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి వేసవికాలంలో పేద ప్రజలకు మేలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు కొమ్మారెడ్డి నాని, టిడిపి నాయకులు ఎండి ఇబ్రహీం, వెలగపాటి విలియం, ప్రముఖ న్యాయవాది, రచయిత ఎం.గోవర్ధన్ రావు, సేవాసమితి ప్రతినిధులు పాల్గన్నారు.

బీసీలకు కొండంత అండ చంద్రబాబు : కేసన

ప్రజాశక్తి - మంగళగిరి

బీసీలకు అన్ని విధాల రక్షణలు కల్పిస్తూ, వారి అభ్యున్నతికి కొండంత అండగా ఉంటామంటూ,మహాత్మా జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడడాన్ని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో స్వాగతించారు. బడుగు బలహీన వర్గాలకు రాజకీయ-సామాజిక గుర్తింపుతో పాటు,వారి ఆర్థికాభివఅద్ధే లక్ష్యంగా టిడిపి పనిచేస్తుందన్నారు. టిడిపి అంటేనే బీసీలని, బీసీల కోసమే ప్రధానంగా ఆనాడు అన్న ఎన్టీఆర్ టిడిపిని స్థాపించారన్నారు. కొత్తగా ఇల్లు కట్టుకుంటున్న బీసీలకు రూ 50 వేల సబ్సిడీ నివ్వడం,బీసీ కార్పొరేషన్ కింద రూ 250 కోట్ల రుణాలు ప్రభుత్వం విడుదల చేయడాన్ని బీసీ సమాజం అభినందిస్తుందన్నారు. బీసీలపై జరుగుతున్న హత్యలు-అత్యాచారాలను అడ్డుకునేందుకు, ఏమాత్రం ఆలస్యం చేయకుండా ప్రభుత్వం వెంటనే రక్షణ చట్టం తేవాలన్నారు. పి-ఫోర్ అనే నూతన సైదాంతిక దఅక్పథం ద్వారా,బీసీలను అన్ని వర్గాలతో సమాన స్థాయిలో నిలబెట్టేందుకు,ఉన్నత వర్గాలు మార్గదర్శకంగా ఉంటూ, తమ ఆదాయాల్లో కొంతమేర పేదలకు ఖర్చు చేయాలని, ఆ విధంగా బడుగుల జీవితాల్ని మార్చి, బంగారు కుటుంబాలుగా చేసేందుకు పూలేలా చరిత్ర పుటలలో నిలిచిపోవాలనడాన్ని పేదలు-బడుగులు హర్షిస్తున్నారన్నారు.

నేటి నుండి ఈ - వేస్ట్ సేకరణ

ప్రజాశక్తి - మంగళగిరి

“స్వచ్ఛ ఆంధ్ర” స్వర్ణాంధ్రలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ వేస్ట్ సేకరణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. పనికిరాని నిరుపయోగంగా వున్న బ్యాటరీలు, మొబైల్ చార్జర్లు, బల్బులు, ఎలక్ట్రానిక్ వస్తువులు లను సేకరించుకోనుట జరిగింది.అదేవిధంగా నగర ప్రజలు మీ గఅహములలో వున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను నగర పాలక సంస్థ వారు ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనమునకు అందజేసి నగర ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కార్పొరేషన్ అధికారులు కోరారు. నగర పాలక సంస్థ కార్యాలయం ముందు పార్క్ రోడ్ ఎంట్రన్స్ వద్ద ఏర్పాటు చేయబడిన త్రిబుల్ ఆర్ సెంటర్లో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను అందజేయాలన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

మణిపూర్‌లో ఏప్రిల్ 7 నుంచి 12వ తేదీ వరకూ జరిగిన 68వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వెయిట్ లిఫ్టింగ్ అండర్-17 కేటగిరిలో సిల్వర్ మెడల్ సాధించిన పెదకాకాని మండలం, ఉప్పలపాడు జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థిని బిట్రా రోచిష్మతిని బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అభినందిం చారు. విద్యార్థిని సత్కరించి, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు చంద్ర వినయ్‌కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక, గుంటూరు జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ మెల్లెంపూడి రవి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షులు బత్తుల కరీముల్లాచౌదరి, గుంటూరు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షులు యార్లగడ్డ శ్రీనివాస్, నేషనల్ టీం కోచ్ నాగశిరీష పాల్గొన్నారు.

విద్యార్థిని బిట్రా రోచిష్మతిని అభినందిస్తున్న కలెక్టర్, డిఇఒ

శిల్పారామాల్లో చిత్రకళా ప్రదర్శనకు అనుమతి

వర్సిటీలో ఎగ్జిబిషన్‌ప్రారంభించిన చైర్‌పర్సన్ మంజులారెడ్డి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ విభాగంలో బిఎఫ్ఎ మూడు సంవత్సరాల విద్యార్థులు రూపొందించిన చిత్రాల ప్రదర్శనను బుధవారం ఆర్ట్ క్రాఫ్ట్ శిల్పారామం రాష్ట్ర చైర్‌పర్సన్ సిహెచ్ మంజులారెడ్డి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క చిత్రము ఒకదానికొకటి పోటీ పడే విధంగా అద్భుతంగా చిత్రీకరించారని విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని శిల్పారామాల్లో ఏర్పాటు చేసే చిత్ర ప్రదర్శనలో పాల్గొనటానికి విద్యార్థులకు అవకాశం కల్పిస్తామని అలాగే వారి చిత్రాలను విక్రయించుకోవడానికి అవకాశం ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా బీఎఫ్ఏ విభాగపు పెయింటింగ్ అధ్యాపకులు జాన్ రత్నబాబు మంజునాథరెడ్డి రూపాన్ని చిత్రీకరించి ఆమెకు బహుకరించారు. కార్యక్రమంలో విభాగపు సమన్వయకర్త పి దేవకాంత్, విభాగపు అధ్యాపకులు బి శేఖర్ బాబు, సిబ్బంది ఎం వంశీ, టీ చంద్రయ్య, రజిత పాల్గొన్నారు.

ఐఎన్‌టిఎస్‌ఒ పరీక్షల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ స్థాయిలో జరిగిన ఐఎన్‌టిఎస్ఓ లెవల్-2 పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన శ్రీచైతన్య విద్యార్థులను గుంటూరు, ప్రకాశం జిల్లాల ఎజిఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య అభినందిం చారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ శ్రీచైతన్య పాఠశాలల నుండి 832 మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొన్నారని, వారిలో ముగ్గురు గ్రాండ్ ప్రైజ్‌గా ల్యాప్ టాప్‌లు, పదమూడు మంది మొదటి బహుమతిగా ట్యాబ్‌లు సాధించారన్నారు. అలాగే 15 మంది ద్వితీయ స్థానంలో, 21 మంది తృతీయ స్థానంలో నిలిచారన్నారు. ఒకటి, రెండు తరగతుల నుండి చిన్నా రులు పాల్గొని స్పెషల్ ప్రైజ్‌లు, గోల్డ్‌మెడల్స్ సాధించారన్నారు.కార్యక్రమంలో పాఠశాలల అకడమిక్ కోఆర్డినేటర్లు సచ్చిదానందమూర్తి, గౌరీశంకర్, ప్రిన్సిపాల్, ఇన్‌చార్జిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న అంజయ్య

క్రీడలను ప్రారంభిస్తున్న కళాశాల సెక్రెటరీ

టిజెపిఎస్‌లో జాతీయ స్థాయి లేసర్ రన్ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపిఎస్ కాలేజిలో బుధవారం మోడరన్ పెంటాథలన్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో తొమ్మిదవ ఎంపిఎఫ్ఐ లేసర్ రన్ సీనియర్స్, మాస్టర్స్ పోటీలు నిర్వహించారు. పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన టిజెపిఎస్ కాలేజి సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, ఒలంపిక్‌లో ఉన్న ఈక్రీడని ఇక్కడ నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు , అధ్యక్షులు వెలగపూడి ఉజ్వల్ మాట్లాడుతూ మాస్టర్ కేటగిరిలో ఏపీ నుండి జి.శ్రీనివాస్‌నాయక్, తెలంగాణ నుండి ఏ దినేష్, అమర్ జిత్ సింగ్, సీనియర్ బాయ్స్‌లో ఏపీ నుండి కె.ప్రేమ్‌చంద్, ఆర్.నరేంద్ర, ఎస్.షణ్ముఖ్‌సంతోష్, సీనియర్స్ ఉమెన్స్‌లో ఏపీ నుండి షేక్.జచేరియా, యస్.కె.పర్వీన్, సి రాలిని వరుసగా గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రెటరీ కె.మౌనిక, ట్రెజరర్ డింపుల్‌కృష్ణ, టిజెపిఎస్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.హెచ్.కామేశ్వర శాస్త్రి, పీజీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి తదితరులు పాల్గొన్నారు.

2న ప్రధాని మోడీ రాజధాని పర్యటన

అధికారులతో కలెక్టర్ సమీక్ష - వెలగపూడిలో ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు

భారత ప్రధాని నరేంద్రమోడి మే 2వ తేదిన అమరావతి పరిధిలో వివిధ శంఖుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటున్న దృష్ట్యా అందుకు తగ్గ ఏర్పాట్లను శ్రద్ధపెట్టి విధులు నిర్వహిం చాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం కలక్టరేట్‌లో ప్రధాని పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ నాగలక్ష్మీ, ఎస్పీ సతీష్ కుమార్‌తో కలిసి సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాని పర్యటనపై రాష్ట్ర స్థాయిలో నోడల్ అధికారులకు ప్రభుత్వం విధులు కేటాయించడం జరిగిందని, జిల్లా అధికారులకు కూడా వారు చేపట్టాల్సిన విధు లపై సూచనలు జారీ చేస్తారన్నారు. ప్రధాని బహిరంగ సభలో పాల్గొనే ముందు రోడ్డుషో వుంటుందని, అందుకు తగ్గ ఏర్పాట్లను పకడ్బం ధీగా చేపట్టాల్సి వుందన్నారు. సెక్యూరిటీ పరంగా అన్ని భద్రతా చర్యలు చేపట్టలని సూచించారు. కార్యక్రమం జరిగే ప్రాంతం మొత్తం శానిటేషన్ చక్కగా ఉండాలని, ఇందుకు డిపిఓ, యంటీయంసీ కమిషనర్ సమన్వ యంతో అవసరమైన సిబ్బందిని కేటాయిం చుకుని పనిచేయాలన్నారు. ప్రాంగణం అంతా కూడా సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. సభా ప్రాంతంలో ప్రజలకు సీటింగ్ ఏర్పాట్లు, మంచినీరు, అల్పాహారం అందించాలన్నారు. రూట్‌ప్లాన్‌పై అధికారులందరూ అవగాహన కలిగి ఉండాలని, వాహనాల రాకపోకలు , ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. విద్యుత్ సరఫరా, బారికేడింగ్, వాహనాల పార్కింగ్, మొబైలు టాయిలెట్ల ఏర్పాట్లు సంబంధిత శాఖలు చేపట్టాలన్నారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొంటున్నందున అందుకు తగ్గ క్రౌడ్ మేనేజ్మెంట్ పాటించి వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడా లన్నారు. కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు , డిఆర్‌ఓ ఎన్.ఎస్.కె. ఖాజావలి, అడిషనల్ ఎస్పీ సుప్రజా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు , జెడ్పీ సిఇఒ సిఇఓ జ్యోతిబసు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వెలగపూడిలో ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - తుళ్లూరు

ప్రధానమంత్రి మోడి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ శాఖ కమిషనర్ వీర పాండ్యన్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఎస్పీ ఎస్ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, ఆయుష్ కమిషనర్ దినేష్ కుమార్, సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ మల్లారపు నవీన్, సూర్య సాయి ప్రవీణ్ చంద్ పరిశీలించారు. హెలిప్యాడ్ ఏర్పాట్లు, సభా ప్రాంగణం వద్ద చేపట్టవలసిన ఏర్పాట్లు, వివిఐపి లు ప్రయాణించే మార్గాలకు సంబంధించిన ప్రాంతాలను పరిశీలించి చేపట్టవలసిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. అధికార యంత్రాంగం సమన్వ యంతో నిర్దేశించిన పనులను పూర్తి చేయాల న్నారు. కార్యక్రమంలో ఆర్ డి ఓ కె శ్రీనివాస రావు, ఆర్ అండ్ బి ఎస్ఈ శ్రీనివాస మూర్తి,సి ఆర్ డి ఎ,రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు

పట్టుదలతో కృషి చేస్తేనే ఉద్యోగ అవకాశాలు

మాజీ ఎమ్మెల్సీ, విద్యావేత్త కె.ఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

దాదాపు ఏడు సంవత్సరాల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించబోతున్న మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగ అర్హతకు ఏకాగ్రతతో కూడిన పట్టుదల, కృషి అభ్యర్థులకు చాలా అవసరమని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. ఆదిత్య కాంపిటేషన్స్ ఆధ్వర్యంలో 2025 మెగా డీఎస్సీ అభ్యర్థులకు బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో బుధవారం ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా టెట్, డీఎస్సీ స్టడీ మెటీరియల్ పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 16,467 మందితోపాటు స్పెషల్ టీచర్స్ 2200 పోస్టులకు త్వరలో నోటిఫికేషన్ రానున్నదన్నారు. భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయుల భర్తీలో డీఎస్సీ అనేది రాజకీయ అంశమవ్వటం విచారకరమన్నారు. పోటీ పరీక్షలలో ఉద్యోగ అవకాశాలు కేవలం ఒక్క మార్కు ఫలితాన్ని నిర్దేశిస్తాయన్నారు. అభ్యర్థులకు సిలబస్ మొత్తం మనసులో ముద్ర పడి ఉండాలని, పరీక్షకు సంబంధించి గత పరీక్షలలో వచ్చిన కనీసం రెండు ప్రశ్నపత్రాలు క్షుణ్ణంగా చదివి ఆకళింపు చేసుకోవాలన్నారు. గైడ్‌లు కొంతవరకే ఉపయోగపడతాయని, తెలుగు అకాడమీ ప్రచురించిన పాఠ్యపుస్తకాలను బాగా అధ్యయనం చేయాలని కోరారు. నోటిఫికేషన్‌కు పరీక్ష సమయానికి కేవలం రెండు నెలలు సమయం మాత్రమే ఉంటుందని గుర్తుంచుకొని, అభ్యర్థులు పూర్తిస్థాయి లక్ష్యాన్ని ఏర్పరచుకొని చదవాలని వివరించారు. ఆదిత్య కాంపిటీషన్స్ అధినేత కె.ప్రణయ్‌కుమార్ మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా డీఎస్సీ, బ్యాంకులు, రైల్వే, గ్రూప్ పరీక్షలకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ అందిస్తూ వందల మందిని ప్రభుత్వ ఉద్యోగస్తులుగా తీర్చిదిద్దామని తెలియజేశారు. కార్యక్రమంలో మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంచాల బోసుబాబు, తన్నీరు రాజ్యలక్ష్మి, అజయ్, ప్రభంజన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లక్ష్మణరావు

బీసీ మహిళ మృతి కేసులో సీఎం, డిప్యూటీ సీఎం, డీజీపీ స్పందించాలి

10 నెలలు గడుస్తున్నా స్పందించని పోలీసులు - నిందితులను అరెస్టు చేయాలి - బాదిత కుటుంబానికి న్యాయం చేయాలి

సీఎం చంద్రబాబుకు లేఖ రాసిన వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ప్రజాశక్తి - వినుకొండ

బీసీ మహిళ మృతి కేసులో పోలీస్ అధికారులు వ్యవహరిస్తున్న నిర్లక్ష్యంపై స్పందించి మహిళను హత్య చేసిన నిందితులను అరెస్టు చేసి బాధిత కుటుంబాన్ని ఆదుకొని న్యాయం చేయాలని వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, డిజిపి లకు బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా బుధవారం వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. వినుకొండ మండలం ఏనుగుపాలెం గ్రామంలో గత ఏడాది మే 17వ తేదీన చింతల దేవి అనే యువతిని కొందరు దుండగలు అత్యాచారం చేసి, బురద కాలువలో తొక్కి అతి దారుణంగా హత్య చేశారని ఆయన ఆరోపించారు. తన భార్యని హత్య చేశారంటూ మృతురాలి భర్త శ్రీనివాసరావు వినుకొండ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేస్తే అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి10 నెలలు పై గడుస్తున్న నేటికి నిగుతేల్చలేదన్నారు. గేదెలు కాసుకొని ఇంటికి వస్తున్న దేవిని మిట్ట మధ్యాహ్నం అత్యాచారం చేసి దుండగులు హత మార్చారని అన్నారు. మృతురాలి భర్త శ్రీనివాసరావు, వారి పిల్లలు ఇద్దరు కలిసి అనేకసార్లు పోలీసులకు మొరపెట్టుకున్న చర్యలు లేవన్నారు. జిల్లా ఎస్‌పి వద్దకు బాధిత కుటుంబ సభ్యులతో కలిసి తాను విన్నవించిన స్పందించలేదన్నారు. ఒక పేద బీసీ మహిళ హత్య కేసును పోలీసులు పది నెలలు గడుస్తున్న నిగ్గు తేల్చకపోవడం దారుణం అన్నారు. మృతురాలు చింతల దేవి పోస్టుమార్టం రిపోర్ట్ ప్రకారం గొంతు ఎముక విరిగినట్టు, కళ్ళ ద్వారా రక్తం వచ్చినట్లు రిపోర్టు వచ్చిందని, అయినా పోలీసులు స్పందించకపోవడం పై ఆయన ప్రశ్నించారు. మహిళలకు అన్యాయం జరిగితే సహించేది లేదంటూ ప్రకటించిన సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, డీజీపీలు వెంటనే ఏనుగుపాలెంలో బిసి పేద మహిళ అత్యాచారం, హత్య పట్ల వెంటనే స్పందించి ముద్దాయిలను అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో న్యాయవాది ఎంఎన్. ప్రసాద్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.